

నేత..గణేశుడు!



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద ప్రతి ఏడాది గణేశుడిని వినూత్నంగా ఏర్పాటు చేస్తారు.. ఈ ఏడాది 18 అడుగుల గణేశుడి విగ్రహం ఏర్పాటు చేశారు.. ఇందులో ప్రత్యేకత ఏమిటో తెలుసా.. ఈ విగ్రహం అంతా నూలు దారపు పోగులతో చేసినదే.. దీంతో ప్రత్యేక ఆకర్షణగా ఉంది.

దండాలయ్యా..ఉండ్రాలయ్యా!

రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా మార్కెట్లు కిటకిటలాడాయి. పండుగ శోభను సంతరించుకున్నాయి. సోమవారం కాస్త డల్‌గా ఉన్నా.. మంగళవారం గిరాకీ పెరగడంతో వ్యాపారుల్లో సంతోషం వ్యక్తమైంది. రాజమహేంద్రవరంలోని దేవీచౌక్, ఏవీ అప్పారావు రోడ్, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, బిక్కవోలు తదితర చోట్ల గ్రామాల నుంచి తెచ్చిన పత్రి, మారేడు, నారింజ, వెలగకాయ, గరిక, అరటి పిలకలు తదితర వాటిని విక్రయించారు. పూజాసామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. పాలవెల్లి రూ.వంద, పాలవెల్లికి కట్టే సీతాఫలం రూ. 15, ఎలక్కాయ రూ. 15, మారేడు రూ. 20, జామ రూ. 10, నారింజ రూ. 15, కలువ పువ్వు రూ.5, యాపిల్, బత్తాయిలు రూ.25 చొప్పున విక్రయించారు. కొబ్బరికాయ రూ.35లు పలికింది.అరటిపండ్లు డజను రూ.100లకు విక్రయించారు. ధరలు కాస్త ఎక్కువగా ఉన్నా వినాయకుడికి ఇష్టమైన వాటన్నింటినీ జనాలు సంచినిండా నింపుకొని వెళ్లారు. ఊరు వాడలా మండపాలు, పందిళ్లు వెలిశాయి. వివిధ రూపాల్లో ఉన్న గణపయ్య విగ్రహాలు ఆకర్షించాయి. మట్టి విగ్రహాలకు గిరాకీ బాగానే ఉంది. పర్యావరణ హితులు ఎక్కువగా మట్టి విగ్రహాలను తీసుకెళ్లారు. మధ్యాహ్నం వర్షం పడినా సాయంత్రానికి శాంతించడంతో మార్కెట్లు కళకళలాడాయి. స్వీట్ షాపులు కూడా రద్దీగానే కనిపించాయి. మామిడి ఆకుల కట్టను రూ.20కి విక్రయిస్తున్నా యి. 10 రకాల పూజా సామగ్రిని సెట్‌గా రూ.100 వరకూ అమ్మకాలు సాగించారు. ధరలు ఆ విధంగా ఉన్నా 'వరాలివ్వు బొజ్జగణేషా' అని వేడుకుంటూ పత్రి, పూజా సామగ్రిని జనం నిండుగా ఇళ్లకు తీసుకెళ్లారు. మరోవైపు వీధివీధిలో మండపాలు, పందిళ్లు వినాయక నవ రాత్రులకు సిద్ధమైపోయాయి. భారీ విగ్రహాల తరలింపు కన్నుల పండువగా జరిగింది.



పూజాసామగ్రి దుకాణాల వద్ద చవితి సందడి



తీగ లాగితే..

డ్రగ్స్ లింకులు!



హైదరాబాద్‌లో రేవ్ పార్టీలో డ్రగ్స్‌తో పట్టుబడిన యువత (ఫైల్)

రాష్ట్రంలో ఎక్కడ పట్టుబడినా మూలాలు ఇక్కడే

- గంజాయి,డ్రగ్స్ కేరాఫ్‌గా తూర్పు
- క్లాసుగా తిరుగుతూ దందాలు
- క్లాసులతో సరిపెడుతున్న పోలీస్
- సర్వనాశనమవుతున్న యువత
- పరారీలో డీటీ మణిదీప్..
- బెయిల్‌కి ముందస్తు ప్రయత్నం
- పసిగట్టడంలో నిఘా పడక
- మామూళ్ల మత్తులో పోలీస్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఏ మూల మాదక ద్రవ్యాలు దొరికినా మూలాలు తూర్పున కనిపిస్తున్నాయి. ఎక్కడో పట్టుబడిన గంజాయి వాసనకు జిల్లా కేంద్ర బిందువుగా మారుతోంది. చివరికి డ్రగ్స్‌లోనూ అదే తీరు కనిపిస్తోంది. తాజాగా హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్ కేసులో కీలక వ్యక్తిగా రాజమహేంద్రవరానికి చెందిన డిప్యూటీ తహశీల్దార్ మణిదీప్ వ్యవహారం మరింత చర్చకు తెరలేపింది. వైసీపీ ప్రభుత్వంలో గంజాయి, డ్రగ్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మూలన చర్యలు ఆరంభించింది. ఈగిల్ టీంను సిద్ధం చేసింది. దీంతో డ్రగ్స్ డొంకలు కదులుతున్నాయి. డిప్యూటీ తహశీల్దార్ డ్రగ్స్ వ్యవహారం కలకలం రేపుతోంది.

కమ్మేస్తున్న గంజాయి పొగ

ఎక్కడ పోలీసులు మాదక ద్రవ్యాలు పట్టుకున్నా ఉమ్మడి తూర్పుగోదావరితో ఏదొక లింకు ఉంటోంది. ఈనెల 16న నెల్లూరు బాలాజీనగర్ పీఎస్ పరిధిలో కారులో గంజాయి తరలిస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం రావడంతో రంగంలోకి దిగారు. కారు డ్రైవరు పోలీసులను ఢీకొట్టి కారుతో పరారయ్యే ప్రయత్నం చేశాడు. వెంబడించిన పోలీసులు రెండు రౌండ్లు కాల్పులు జరిపి ఒక వ్యక్తిని, 22 కిలోల గంజాయిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి రాజమహేంద్రవరానికి చెందిన బీరక ప్రకాశ్ అలియాస్ సూర్యప్రకాశ్ అని గుర్తించారు. ఈనెల 8న ధవళేశ్వరం ఐవో సీఎల్ కాలనీకి చెందిన సతీశ్ అదృశ్యమయ్యాడు. అతనితోపాటు రైళ్లలో సమోసాలు విక్రయించే స్నేహితులు గంజాయి తాగిన మైకంలో చంపేశారు. కుళ్లిన స్థితిలో ఆ యువకుడి శవం లభ్యమైంది. సుమారు రెండేళ్ల కిందట రాజమండ్రికి చెందిన ఓ యాంకర్ హైదరాబాద్‌లోని గంజాయి కేసులో ఆరోపణలు ఎదుర్కొన్నాడు. పోలీసులు ఏమీలేదని తీసి పారేస్తున్నా జరుగుతున్న ఘటనలు నిజమని రుజువు చేస్తున్నాయి. రాజమహేంద్రవరంతోపాటు గ్రామాలకు సైతం గంజాయి పాకేసింది. సిగరెట్లలో పొగాకు తీసేసి అందులోకి నేరుగా గంజాయి నింపి పెద్దఎత్తున విక్రయాలు జరుపుతున్నారు.




చుక్‌చుక్‌లో గప్‌చుప్‌గా

స్టూడెంట్స్ మాదిరిగా బ్యాగులు తగిలించుకొని రైళ్లలో గంజాయి ఆకు, పొడి, లిక్విడ్ రూపాల్లో హైదరాబాద్ పబ్‌లకు సరఫరా చేస్తున్నారు. దీనికి రాజమండ్రి, సామర్లకోట, తుని, అన్నవరం, అనకాపల్లి రైల్వే స్టేషన్లను ఎంచుకుంటున్నారు. విశాఖ వైపు నుంచే వచ్చే బొకారో, కోణార్క్, గువాహటి తదితర రైళ్లు గంజాయి రవాణాకు అనువుగా మారాయని ఇప్పటికే రైల్వే పోలీసులు గుర్తించారు. ఆ రైళ్లలో బోగీలు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటాయి. దీంతో తనిఖీలు చేయడం అసాధ్యం. గంజాయి తీసుకెళ్తున్నవాళ్లు హైదరాబాద్, బెంగళూరు వైపు వెళ్తారు. కొందరు విజయవాడలో దిగిపోయి చెన్నై లేదా చెన్నై వెళ్ల కుండా కాట్పాడి జంక్షన్ మీదుగా నేరుగా వెళ్లే రైళ్లను ఎంచుకొని సేలం, ఈరోడ్‌కు చేరుస్తున్నారు.

నిద్దరోతున్న నిఘా

జిల్లాలోని పోలీస్, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ వంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల్లో నిఘా నిద్దరోతున్నట్టుగా పరిస్థితులు చెబుతున్నాయి. ముఖ్యంగా పోలీస్‌కి సంబంధించి ప్రతి స్టేషన్‌లో ఒక నిఘా విభాగ పోలీస్ ఉంటారు. ఆ పీఎస్ పరిధిలోని అనుపానువులు పసిగట్టి స్పెషల్ బ్రాంచి అధికారులకు తెలియజేస్తే నేరుగా ఎస్పీ చెవికి చేరతాయి. అయితే పోలీస్ నిఘా వృత్తేతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందనే విమర్శలున్నాయి. ఈగిల్ టీం, నిఘా విభాగం ఎవరి దారి వారిదే అన్నట్టుగా ఉన్నాయి. కనీసం నగరాలను ఆనుకొని ఉన్న ప్రాంతాల్లోని రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లలో జరుగుతున్న అసాంఘిక పార్టీలపై కూడా నిఘా ఉండడం లేదంటే.. ఆ పరిస్థితులే మణిదీప్ వంటి వారి దందాలకు ఊతంగా మారాయని చెప్పక తప్పదు. మరోవైపు ఎక్సైజ్ పోలీసులు మద్యం వ్యాపార ప్రక్రియలో బిజీగా ఉంటున్నారు.

డీటీ..ఇదేంటి?



స్నేహితులకు మెసేజ్

ఏపీ నుంచి వెళ్లి డ్రగ్స్‌తో రేవ్ పార్టీ చేసుకుంటున్న ఆరుగురిని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ వింగ్, గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రావుపాలెం, ఆలమూరు, రాజమహేంద్రవరానికి చెందిన వాళ్లే.. వీళ్లను పట్టుకుని తీగ లాగితే ధవళేశ్వరం పోలవరం భూసేకరణ పరిపాలనా కార్యాలయంలో చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న మణిదీప్ డొంక కదిలింది. 2012లో కారుణ్య నియామకం కింద రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా జాయినైన మణిదీప్.. ఆర్‌ఐగా ఉన్న సమయంలో లంచం ఆరోపణలతో సస్పెన్షన్‌కి గురయ్యాడు. అనంతరం డ్రగ్స్ ముఠాలతో పరిచయాలు పెంచుకున్నాడు. ఏడాదికి మూడొంతులు హైదరాబాద్, ఊటిలోనే ఉంటాడు. విలాసవంతమైన పార్టీలను ప్యాకేజ్‌గా ఒప్పుకోవడం ప్రవృత్తిగా చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని రేవ్ పార్టీ పెట్టిన గెస్ట్‌హౌస్ కూడా ఇతనే రాజమహేంద్రవరం నుంచి బుక్ చేశాడని ప్రచారం జరిగింది. అలాగే మణిదీప్ తరచుగా నామవరం రోడ్‌లోని ఓ విలాసవంతమైన రిసార్ట్‌లో పార్టీలు పెట్టేవాడు. రాజానగరం తదితరచోట్ల ఉన్న రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లు ఇతడి చేతిలోనే పెట్టుకున్నాడని కూడా చెబుతారు. అలాగే రాజమహేంద్రవరం కేంద్రంగా గంజాయి లోకల్‌గా సమకూరుస్తూ ఖరీదైన డ్రగ్స్ కొకైన్, ఎండీఎంఏ వంటి వాటిని ముంబై, బెంగళూరు నుంచి తీసుకువస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇక రాజమహేంద్రవరం సమీపంలోను, రాజానగరం ప్రాంతంలోను మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలు ఎక్కువ. సుమారు 4 వేల మందిపైనే విద్యార్థులుంటారు. వీరిని లక్ష్యంగా చేసుకుని మధ్యవర్తుల ద్వారా డ్రగ్స్‌ని విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. మణిదీప్ తన రేవ్ పార్టీల సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. మణిదీప్ రకరకాల నిషేధిత డ్రగ్స్‌ని పరిచయం చేసి కుర్రాళ్లను నాశనం చేస్తున్నాడని ఆరోపిస్తూ ఒక వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా ప్రస్తుతం మణిదీప్ పరారీలో ఉన్నాడు. ముందస్తు బెయిల్ ప్రయత్నిస్తున్నాడని చెబుతున్నారు. తెలంగాణ పోలీసుల నుంచి సమాచారం వచ్చిన వెంటనే మణిదీప్ వద్దకు వెళ్లిన స్పెషల్ బ్రాంచి పోలీసులు అతడు చెప్పింది విని వెనుదిరగడం ఆరోపణలకు తావిస్తోంది. మణిదీప్‌కి ఎంతటి వారినైనా డబ్బుతో లొంగదీసుకోవడం అలవాటు కాబట్టి ఇప్పుడూ అదే జరిగి ఉంటుందనే విమర్శలున్నాయి. ఈ కేసుతో తనకు సంబంధం లేదంటూ తన స్నేహితులకు మణిదీప్ సోమవారం రాత్రి ఒంటి గంట సమయంలో వాట్సాప్ మెసేజ్ పెట్టడంపై వాళ్లే విస్తుపోతున్నారు.

ప్రసాదాలకు ప్లాస్టిక్ ప్లేట్లు వాడొద్దు

నోడల్ ఆఫీసర్ల సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మంచినీటి పైపులైను లీకులకు సంబంధించి పదే పదే ఫిర్యాదులు అందుతుంటే ఇంజనీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారని కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) పి.ప్రశాంతి ప్రశ్నించారు. నోడల్ అధికారులు ప్రతిరోజూ తప్పనిసరిగా తమకు కేటాయించిన వార్డుల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో వినాయక చవితి పందిళ్ల అనుమతులు, వార్డు సచివాలయాల పనితీరు, డ్రైనేజీ మేనేజ్‌మెంట్, డోర్ టు డోర్ చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, రెవెన్యూ కలెక్షన్, సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నిర్మూలన తదితర అంశాలపై నోడల్ ఆఫీసర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియకు సంబంధించి డంపింగ్‌యార్డులో కార్యక్రమాలు సరిగా జరగడంలేదన్నారు. వర్మి కంపోస్టు, తడి పొడి చెత్త సేకరణ సక్రమంగా లేదన్నారు. అనుమతుల్లేని ఫ్లెక్సీలను తొలగించడంలో తాత్సారం ఎందుకని ప్రశ్నించారు. వినాయక చవితి పందిళ్లకు సంబంధించి సచివాలయాల వారీగా నివేదిక అందించాలన్నారు. ప్రసాదాల పంపిణీకి ప్లాస్టిక్ ప్లేట్లను వినియోగించరాదన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులతో వారానికోసారి తప్పనిసరిగా రివ్యూ నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో డీటైల్డ్ నోట్ కచ్చితంగా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. నోడల్ అధికారులు అందరికీ వైర్‌లెస్ సెట్లను అందజేయాలని ఆదేశించారు. వినాయక చవితి నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, సెక్రటరీ శైలజ వల్లి పాల్గొన్నారు.

తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి : జేసీ

రాజమహేంద్రవరం రూరల్ 26(ఆంధ్రజ్యోతి): తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని జేసీ చిన్నరాముడు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, మండల తహశీల్దార్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారుల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయి అధికారుల పనితీరు జిల్లా అభివృద్ధి, ప్రగతిపై ప్రభావం చూపుతుందన్నారు. రెవెన్యూ అధికారులకు నిర్దేశించిన మండలాల పరిధిలో లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో 272 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి రీసర్వే ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో డీఆర్‌వో సీతారామమూర్తి, సర్వే అధికారి లక్ష్మీనారాయణ, ఆర్డీవోలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

573.66 క్వింటాళ్ల బియ్యానికి 30న వేలం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 573.66 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఈ నెల 30వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ (పౌరసరఫరాలు) ఛాంబర్ వద్ద ఉదయం 11 గంటలకు వేలం ప్రక్రియ జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనేవారు 29వ తేదీన జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఉన్న పీడీఎస్ బియ్యం శాంపిల్స్‌ను పరిశీలించవచ్చని తెలిపారు. 6ఏ కేసుల్లో నమోదై పెండింగ్‌లో ఉన్న వారు వేలం పాటలో పాల్గొనేందుకు అనర్హులు అని తెలిపారు.

త్రిమందిర్‌కు రూ.88 కోట్ల డీపీఆర్

బిక్కవోలు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తూర్పు చాళుక్యాస్ త్రిమందిర్ పేరుతో కేంద్ర పర్యాటక శాఖ ఆదేశాలతో రాష్ట్ర టూరిజం శాఖ తయారు చేసిన రూ.88 కోట్ల డీపీఆర్‌పై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం చర్చించారు. ముందుగా లక్ష్మీగణపతిని దర్శించి ఆలయ ఆవరణలో అధికారులతో చర్చించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బిక్కవోలులోని శ్రీలక్ష్మీగణపతి, శ్రీగోలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని శ్రీసూర్యనారాయణమూర్తి ఆలయాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర టూరిజం శాఖ రూ.88 కోట్లతో డీపీఆర్‌ను తయారు చేసిందన్నారు.గొల్లలమామిడాడలోని రామాలయాన్ని ఇందులో చేర్చగా ఆలయ యాజమాన్యం అంగీకరించలేదన్నారు. బిక్కవోలు కెనాల్‌రోడ్డులోని జోడినాదాల తూము నుంచి బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయం వరకూ బైపాస్ రోడ్డు నిర్మించి అక్కడ నుంచి గొల్లల మామిడాడ రోడ్డుకు కలుపుతారన్నారు. శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో భక్తులు ఉండేందుకు కాటేజీలు నిర్మిస్తారని, గోలింగేశ్వరస్వామి ఆలయం చుట్టూ అభివృద్ధి చేస్తారన్నారు. గొల్లల మామిడాడలోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో కల్యాణమండపం, కాటేజీలు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారన్నారు. దీనిపై మార్పులు చేర్పులు సూచించమని అధికారులకు, స్థానికులకు తెలిపామన్నారు. వీరి సూచనల మేరకు తుది డీపీఆర్ రాష్ట్ర టూరిజం ద్వారా కేంద్రానికి అందజేస్తామన్నారు.

సమన్వయంతో పనిచేయండి

నాయకులు, కార్యకర్తలకు త్రిసభ్య కమిటీ సభ్యుల సూచన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు తదితరులు.. ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

కోరుకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. కోరుకొండ మండలం బూరుగుపూడి టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా పార్టీ సమావేశంలో పార్టీ అధినాయకత్వం నియమించిన త్రిసభ్య కమిటీలో సభ్యులైన మంత్రి కొలుసు పార్థసారథి, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు , కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి పాల్గొన్నారు. ముందుగా జిల్లా కమిటీపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభి వృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై టీడీపీ నేతలకు, కార్యకర్తలకు అభిమానులకు దిశా నిర్దేశం చేశారు.మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సహా అనుబంధ సంఘాలు, ఇతర కీలక పదవుల భర్తీపై జిల్లా పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. వినాయక చవితి తర్వాత పార్టీ అధిష్ఠానం తన నిర్ణయాలు వెలువరిస్తుందని స్పష్టం చేశారు.పార్టీ కోసం కష్టపడిన వారికి న్యాయం చేస్తామన్నారు. రాజానగరం టీడీపీ ఇన్‌చార్జ్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ కార్యకర్తలు బలంగా ఉంటే పార్టీ బలంగా ఉంటుందన్నారు.టీడీపీ జిల్లా నాయకత్వానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. పార్టీ పదవుల్లో రాజానగరం, నిడదవోలు నియోజకవర్గాలకు పెద్ద పీట వేయాలన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు మాట్లాడుతూ పార్టీ జెండా మోసిన వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఉండాలన్నారు. లీడర్‌కు క్యాడర్‌కు మధ్య బంధం పెరగాలన్నారు. కనీసం 15 ఏళ్లు మనం అధికారంలో ఉండాలన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొంత మంది కేవలం ఫేస్‌బుక్, వాట్సప్‌లో ఫొటోలు పెట్టి అధిష్ఠానం దృష్టిలో పడాలని చూస్తున్నారని అటువంటివారిని పక్కన పెట్టి భుజాలు అరిగేలా జెండాలు మోసిన కార్యకర్తలకు పెద్దపీట వేయాలన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ నిజమైన కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ 2014-19 చివరి దశలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. అనపర్తి టీడీపీ ఇన్‌చార్జ్ నల్లమిల్లి మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు బలంగా ఉంటేనే పార్టీకి మనుగడ ఉంటుందన్నారు.మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ పార్టీలో ఉంటూ వెనుక నుంచి గోతులు తవ్వే నాయకులకు మనుగడ ఉండదన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు.పార్టీలో ఎవరైనా నేను గొప్ప అని విర్రవీగితే కొమ్ములు విరుగుతాయన్నారు. అధికారులు ఇంకా నాయకులకు పార్టీకి సహకరించడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి ఆశిష్ లాల్, ఏఎంసీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు,అడపా వీరబాబు, కాంతారావు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ

త్రిసభ్య కమిటీ ముందు 8 మంది పేర్లు ప్రతిపాదన

రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : టీడీపీ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ తీవ్రంగా ఉంది. చాలా మంది తనకు కావాలంటే తనకు కావాలని పోటీ పడడం గమనార్హం.చివరకు అధిష్ఠానం ఎవరికిచ్చినా సంతోషమే అనే అభిప్రాయం కూడా వెలువడినట్టు సమాచారం.జిల్లా అధ్యక్ష పదవితో పాటు ప్రధాన కార్యదర్శి, ఇతర జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీలో జిల్లాకు స్థానం గురించి టీడీపీ అధిష్ఠానం త్రిసభ్య కమిటీని పంపిన సంగతి తెలిసిందే.త్రిసభ్య కమిటీలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఉన్నారు. మంగళవారం కోరుకొండ మండలం బూరుగుపూడిలోని టీడీపీ కార్యాలయంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో పాటు నియోజకవర్గానికి సుమారు 10 మంది వంతున ప్రత్యేక ఆహ్వానితుల అభిప్రాయాలు సేకరించారు. ఈ ముగ్గురు ఒక ప్రత్యేక గదిలో కూర్చుని ఒక్కొక్కరి అభిప్రాయాలు తీసుకున్నారు. మొదట ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డిరెడ్డి వాసు, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జిలు బీవీఆర్ చౌదరి, బూరుగుపల్లి శేషారావు, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అభిప్రాయాలు తీసుకున్నారు. గుడా మాజీ చైర్మన్ గన్నికృష్ణను లోపలికి ఆహ్వానించారు. అనంతరం ఒక్కో నియోజకవర్గం నుంచి 10 మందిని, ఆయా ఎమ్మెల్యేలు ఇన్‌చార్జిల సమక్షంలోనే పిలిచి అభిప్రాయాలు సేకరించారు. ఇందులో 8 మంది పేర్లు ప్రముఖంగా వినిపించినట్టు సమాచారం. రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తదితరుల పేర్లు పరిశీలనకు వచ్చినట్టు తెలిసింది. వీరిలో ఎవరో ఒకరు జిల్లా అధ్యక్షుడవుతారు. మిగిలిన వారిలో ఒకరిని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించే అవకాశం ఉంది. అనంతరం త్రిసభ్యకమిటీ సభ్యులు మాట్లాడుతూ అందరి అభిప్రాయాలు సేకరించామని వారు ప్రతిపాదించిన పేర్లను అధిష్ఠానానికి అందజేస్తామన్నారు. పనిచేసే ప్రతీ వ్యక్తికి గుర్తింపు ఉంటుందన్నారు. వినాయక చవితి వెళ్లిన తర్వాత జిల్లా టీడీపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు మొత్తం కమిటీని నియమించనున్నారు. ఇప్పటికే నియమించిన కమిటీలను అధికారికంగా ప్రకటించనున్నారు.



విఘ్నాధిపతి..అయినవిల్లి వినాయకుడు

అయినవిల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు అయినవిల్లి ముస్తాబైంది. భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.అయినవిల్లి వినాయకుడు విఘ్నాలను తొలగించే స్వామిగా పేరొందారు. వినాయక చవితి.. స్వామికి ఇష్టమైన బుధవారం రావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు దర్శనం కల్పిస్తారు. ఏ కార్యక్రమం తలపెట్టినా ముందుగా అయినవిల్లి వినాయకుడిని పూజిస్తే విఘ్నాలు లేకుండా పూర్తవుతుందని భక్తుల నమ్మకం.స్థల పురాణం ప్రకారం ఈ క్షేత్రం కాణిపాక వినాయక క్షేత్రం కన్నా పురాతనమైనది. అయినవిల్లిలో స్వర్ణ గణపతి మహాయజ్ఞం జరుగుతుండగా వినాయకుడు ప్రత్యక్షమై అక్కడి వారిని అనుగ్రహించాడని 14వ శతాబ్దంలో శంకరభట్టు రాసిన శ్రీపాదవల్లభ చరిత్రలో ఉంది. ఆ సమయంలో వినాయకుడిని హేళన చేసిన ముగ్గురు మూర్ఖులను వినాయకుడు దండించగా తర్వాత కాలంలో వారే మూగ, చెవిటి, గుడ్డి వారిగా జన్మించి కాణిపాకం వినాయకుడి ఆవిర్భవాన్ని గుర్తించారని స్థల పురాణం చెబుతోంది.

కోర్కెలు తీర్చే.. బిక్కవోలు గణేశుడు..

బిక్కవోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చెవిలో చెబితే చాలు కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి కెక్కిన బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం నుంచి నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసారు. తూర్పు చాళుక్యుల కాలంలో 1100 సంవత్సరాల కిందట పంటపొలాల్లో స్వామి స్వయంభూగా వెలిశాడు. బిక్కవోలు వినాయకుడు పదకొండు అడుగుల ఎత్తు, ఆరు అడుగుల వెడల్పుతో దర్శనమిస్తాడు. స్వామి తొండం కుడివైపునకు ఉండడంతో కోర్కెలు చెబితే తప్పక నెరవేరుస్తాడని భక్తుల నమ్మకం. బుధవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా భారీ క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం తెల్లవారుజామున 1.58 గంటలకు స్వామికి అలంకారం చేసిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు గ్రామోత్సవం జరుపుతామన్నారు. ఉదయం 11.04గం.లకు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు.



జై జై గణేశా!

జై జై గణేశా.. జైకొడతాం గణేశా అంటున్నారు.. ఊరూవాడా చవితి సందడి వచ్చేసింది.. వినాయక పందిళ్లలో విగ్రహాలను ఏర్పాటు చేశారు.. బుధవారం నుంచి 9 రోజుల పాటు ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని బిక్కవోలు, అయినవిల్లి వినాయక ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చవితి సందర్భంగా చామంతి, మల్లెలు, జాజులు తదితర పువ్వుల ధరలు చుక్కలనంటాయి..



ఐడియా.. అదిరింది!

తాళ్లపూడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గణేశుడిని ప్రతి రోజూ చూస్తూనే ఉంటారు.. ఎందుకంటే విద్యార్థులు కదా.. చవితికి ఏం చేద్దామా అని ఆలోచించారు.. వినాయకుడి వేషధారణలు.. పూజలు ఓల్డ్.. కొత్తగా ఏదైనా చేద్దామనుకున్నారు.. వినాయకుడి కూర్పుగా తయారైతే ఎలా ఉంటుందా అని ఆలోచించారు.. కాస్త కష్టమే కానీ.. ట్రై చేద్దామని ముందుగా ముగ్గుతో వినాయకుడి ప్రతిమ గీశారు.. ఆ తరువాత ఒక్కొక్కరుగా విద్యార్థులు ఇలా కూర్చుకున్నారు. తీరా చూస్తే వినాయకుడి ప్రతిమ కళ్లకు కట్టినట్టు వచ్చింది.. తాళ్లపూడి మాంటిస్సోరీ పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులు ఇలా వినాయకుడి ఆకృతిని చిత్రీకరించారు.





గణేశా..తమాషా!

మామిడికుదురు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గణేశుడి ఆకారం ఎలాగైనా ఇమిగిపోతోంది.. అందుకే రకరకాలుగా విగ్రహాలు తయారుచేస్తారు..పూజిస్తారు..ఈ చిత్రంలోనే చూస్తున్నారుగా..ఈ విగ్రహం ఏమిటో గుర్తుపట్టారా.. ఏదో మొక్కజొన్న గింజలతో తయారుచేసిన గణేశుడు అనుకుం టున్నారు కదా..కాదు కాదు.. కందిపప్పును అతికించి ఇలా పర్యావరణ గణేశుడిని తయారుచేశారు. మట్టి గణపతిని పూజించండి.. పర్యావరణాన్ని రక్షించండి అంటూ మామిడికుదురు దీప్తి పాఠశాల విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు.పర్యావరణానికి హాని కలగకుండా పీచు, మట్టి, కందిపప్పు, పసుపు, కుంకుమ, పిండి, కూరగాయలు, పండ్లు వంటి పలు రకాలతో వినాయక ప్రతిమలు తయారుచేసి ప్రదర్శించారు. నీటిలో కరిగిపోయే వస్తువులతో గణపతిని తయారుచేసి పూజించాలని విద్యార్థులు అవగాహన కల్పించారు.



మన బుజ్జి గణేశులు

ఆలమూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వచ్చిందంటే ఆ సందడే వేరు.. చిన్నారుల నుంచి పెద్దల వరకూ అందరికీ పండగే.. ఈ చిత్రంలోనే చూడండి.. మన బుజ్జి వినాయకులు ఎలా ముస్తాబయ్యారో.. బుధవారం వినాయక చవితి సెలవు కావడంతో పాఠశాలల్లో మంగళవారమే ఉత్సవా లు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో మంగళవారం ఇలా దర్శనమిచ్చారు. స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు ముందుగా వినాయక పూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. వినాయక జన్మవృత్తాంతాన్ని ఆయన విద్యార్థులకు వివరించారు.

పువ్వులు.. అధరహో!

- అమాంతంగా పెరిగిన ధరలు
- చామంతులు కేజీ రూ.400
- మల్లెలు..జాజుల ధర టాప్

కడియం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పువ్వుల ధరలు అదిరిపోతున్నాయి. చామంతులు ఒక్కో పువ్వు లెక్కన విక్రయిస్తున్నారు. ఒక్కో పువ్వు రూ2ల వరకూ ధర పలుకుతోంది. కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్ వినాయక చవితి శోభను సంతరించుకుంది. దీంతో పూల ధరలు ఒక్కసారిగా రెట్టింపు పెరిగాయి. కర్నాటక నుంచి బంతి, తమిళనాడు నుంచి చామంతి పూలను దిగుమతి చేసుకుని వ్యాపారస్తులు విక్రయిస్తుంటారు. మిగిలిన పూలు మన ప్రాంతంలోనే లభిస్తాయి. కడియపులంక పూలమార్కెట్ అటు కొనుగోలుదారులు, వ్యాపారస్థులు, ఇటు రైతులతో కిటకిటలాడింది. వినాయక చవితి సందర్భంగా పూలధరలు ఇలా ఉన్నాయి.

పువ్వుల ధరలు ఇలా ఉన్నాయి..

పూలు	గతంలో	ప్రస్తుతం
చామంతి (కేజీ)	రూ. 300	రూ. 500- 600
మేరీగోల్డ్ చామంతి(కేజీ)	రూ. 200	రూ. 400
నీలం చామంతి (కేజీ)	రూ. 200	రూ. 450
కలకత్తా బంతి (కేజీ)	రూ.60	రూ. 100 - 130
పసుపు బంతి (కేజీ)	రూ. 60	రూ. 199 - 130
లిల్లీ (కేజీ)	రూ. 200	రూ. 400
జాజులు (కేజీ)	రూ.500	రూ. 1,000
మల్లెలు (కేజీ)	రూ. 600	రూ. 1,300
కాగడాలు (కేజీ)	రూ. 600	రూ. 600
స్టార్‌గులాబీ (కేజీ)	రూ. 180	రూ. 300
సెంటుగులాబీ (కేజీ)	రూ.150	రూ. 250
కనకంబరం (బారు-1)	రూ.150	రూ. 200 - 220

లౌడీయిజం వద్దు!



కాకినాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గణపతి ఉత్సవాలు వచ్చాయంటే సంబరాలు అంబరాన్నంటుతాయి. వినాయక నిమజ్జనం ఇతర సమయాల్లో భారీ డీజే శబ్దాలతో పందిళ్లలో మోత మోగిస్తారు. డీజేలు నయా ట్రెండ్.. వాటి నుంచి 60 డెసిబుల్స్‌ను మించి శబ్దం వస్తుండడంతో ప్రజలు వివిధ రుగ్మతల బారిన పడుతున్నారు. వినికిడి లోపానికి గురవుతున్నారు. కొన్నిసార్లు గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో అమలాపురం పట్టణంలో ఒక యువకుడు డీజే శబ్దాలకు గుండెపోటుకు గురై మృతి చెందాడు. సాధారణంగా మన చెవులు 120-130 డెసిబుల్స్ మాత్రమే భరించగలవు. అంతకు మించితే ప్రమాదమే.60 డెసిబుల్స్‌లోపు శబ్దం వింటే ఇబ్బందులు ఉండవు. వంద డెసిబుల్స్ దాటితే గుండె జబ్బులు ఉన్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. 110, 120 డెసిబుల్స్ దాటితే విపరీతమైన కోపం, తలనొప్పి వస్తుంది.160 డెసిబుల్స్ దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం చూపుతుంది. 190 డెసిబుల్స్ దాటితే వినికిడి శక్తి కోల్పోతారు. డీజే బాక్సుల నుంచి వచ్చే వైబ్రేషన్ కారణంగా నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. మెదడుకు రక్తసరఫరా తగ్గి, గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలు మూసుకుపోతాయి. గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. గర్భిణులకు డీజే వైబ్రేషన్స్ ప్రమాదకరమే.అటువంటి ప్రమాదకరమైన డీజేలను నిషేధించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.దీంతో "డీజేలు వద్దు. తీన్మార్‌లు ముద్దు" పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్నారు. ఈ సారి పందిళ్లలో డీజేలు ఏర్పాటు చేయవద్దని, తీన్మార్‌లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా పోలీసు అధికారులు సూచిస్తున్నారు.పోలీసుల అనుమతి లేకుండా డీజేలు, బాణసంచా వాడరాదంటూ సూచనలు చేస్తున్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరిపేలా ఉత్సవ కమిటీలు జాగ్ర త్తలు పాటించాలని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు లౌడ్ స్పీకర్లు వాడరాదని, ఇలా పలు నియమనిబంధనలు విధించారు.

ఆవేశంలో మాట్లాడా..క్షమించండి!

మహాసేన రాజేష్

పిఠాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆవేశంలో తాను మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్తున్నట్టు 'మహాసేన' రాజేష్ తెలిపారు. 2020లో కాకినాడ జిల్లా పిఠాపురంతో పాటు పలు చోట్ల విగ్రహాలు, ఆలయాలను ధ్వంసమయ్యాయి. దీనిపై అప్పట్లో హిందూ సంఘాలు, బ్రాహ్మణులు ఆందోళనలు నిర్వహించారు.ఇదే సమయంలో బ్రాహ్మణులను కించపరిచేలా మహాసేన రాజేష్ సోషల్ మీడియాలో మాట్లాడారు.దీనిపై అప్పట్లో బ్రాహ్మణ, హిందూ సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. తదనంతరం పరిణామాల నేపథ్యంలో మంగళవారం పిఠాపురం పాదగయ క్షేత్రానికి వెళ్లిన మహాసేన రాజేష్ బ్రాహ్మణులకు, హిందూ సంఘాలకు క్షమాపణ తెలిపారు.తనకు ఉన్న సమాచారంతో అప్పట్లో మాట్లాడానని, అంతేగానీ ఎవరిపైనా ద్వేషంతో మాట్లాడలేదని చెప్పారు. ఒకరిద్దరి కోసం మాట్లాడిన విషయం సమాజాన్ని బాధపెట్టిందని గుర్తించి, వారు కోరకపోయినా క్షమాపణ చెప్తున్నట్టు తెలిపారు. వారు కేసు విత్‌డ్రా చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో హిందూ, పురోహిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

28 నుంచి జీజీయూలో అంతర్జాతీయ సదస్సు

రాజానగరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ(జీజీయూ)లో ఈ నెల 28, 29 తేదీల్లో హరిత ఆర్థిక వ్యవస్థ(గ్రీన్ ఎకానమీ), స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు(సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్-ఎస్‌డీజీఎస్), కృత్రిమ మేధ ఆధారిత హరిత సాంకేతికతలు(ఆల్ ఫర్ గ్రీన్ టెక్నాలజీ)అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు వర్శిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) తెలిపారు. ఇందుకు సంబంధించి వర్శిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రొ వైస్ చాన్సలర్ కేవీబీరాజుతో కలిసి వెల్లడించారు. తైవాన్‌లోని నేషనల్ సన్ యాట్-సెన్ యూనివర్శిటీ భాగస్వామ్యంతో, నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్(ఎన్‌ఎస్‌టీసీ)తైవాన్ సౌజన్యంతో జరిగే ఈ సదస్సులో పలు రాష్ట్రాల ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలతో పాటు తైవాన్ నుంచి ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు,నిపుణులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీ 4.0, 5.0 టెక్నాలజీపై అవగాహన సదస్సు

జేఎన్టీయూకే, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని అలూమ్ని ఆడిటోరియంలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్ వీహబ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్(ఏఐఎం), నీతిఆయోగ్, మైటీ స్టార్టప్ హబ్ సహకారంతో ఇండస్ట్రీ 4.0, 5.0 సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు, అధ్యాపకులకు ఇంక్యుబేషన్, యాక్సలరేషన్ సహకారం అనే అంశంపై డైరెక్టర్ ఆఫ్ ఇన్నోవేషన్స్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ అధ్యక్షతన అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. అతిథులుగా అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్ వీహబ్ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి జహారుల్లా ఎస్ఎండీ, జేఎన్టీయూ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, అకడమిక్స్ డైరెక్టర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ విచ్చేశారు. జహారుల్లా తన 17 ఏళ్ల అనుభవాన్ని పంచుకుంటూ డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ ఆవిష్కరణ నమూనాలు, టైడ్ 2.0 ద్వారా వచ్చిన అవకాశాల ప్రాముఖ్యతను వివరించారు. వీసీ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యా సంస్థలు కేవలం బోధన, పరిశోధనా పరిమితులే కాకుండా ఆవిష్కరణ, వినూత్న ఆలోచనల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ప్రామాణికతతో కూడిన పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. సదస్సులో యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీపాదవల్లభునికి

సహస్ర గులాబీ అర్చన

పిఠాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో ఆరో రోజైన మంగళవారం సహస్ర గులాబీ అర్చన నిర్వహించారు. శ్రీపాదవల్లభుడు, దత్తాత్రేయస్వామి నృసింహసరస్వతులను విశేషంగా అలంకరించారు. శత రుద్రాభిషేకం, సర్వపుష్ప పూజ, సహస్రనామార్చన, మంగళహారతి, వేదపారాయణ, దత్త మూలమంత్ర అనుష్ఠానము, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణం జరిగాయి. ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొడనూర్-బారౌనికి 26 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌లు



సామర్లకోట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పొడనూర్-బారౌని-పొడనూర్ మధ్య రాజమహేంద్రవరం మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు సెప్టెంబరు 6 నుంచి నవంబరు 29 వరకూ 26 వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపనున్నట్టు మంగళవారం ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా వెల్లడించారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది. 06055 నెంబరు గల రైలు పొడనూర్-బారౌనిల మధ్య సెప్టెం బరు 6నుంచి నవంబరు 29వరకూ ప్రతీ శని వారం పొడనూర్‌లో ఉదయం 11.50 నిమిషాలకు బయలుదేరనుంది. అలాగే 06056 నెంబరు గల రైలు బారౌని-పొడనూర్‌ల మధ్య సెప్టెంబరు 9 నుంచి డిసెంబరు 2 వరకూ ప్రతీ మంగళవారం బారౌనిలో రాత్రి 11.45 నిమిషాలకు బయలుదేరనుంది.

06055 నెంబరు గల ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు పొడనూర్‌లో ప్రతీ శనివారం ఉదయం 11.50 గంటలకు బయలుదేరుతుంది. పొడనూర్, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పెట్టయ్, కాట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాజమహేంద్రవరానికి ఉదయం 7.20గంటలకు చేరుతుంది. దువ్వాడ, సింహాచలం రోడ్డు, విజయనగరం, బొబ్బిలి, పార్వతీ పురం, రాయగడ, మునిగుడ, టిట్లాగర్, సంబల్ పూర్, రూర్కెలా, నౌవాగాన్, హటియా, రాంచీ, మురి, బొకారోస్టీల్ సిటీ, ధన్‌బాద్, బార్కార్, చిత్తరంజన్, మదుపూర్, జాసిది, జాహజా, కియుల్‌ల మీదుగా బారౌనికి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుతుంది.

06056 నెంబరు గల బారౌనీ-పొడనూరుల మధ్య ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు బారౌనీలో ప్రతీ మంగళవారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరుతుంది. ఈ రైలు రాజమహేంద్రవరానికి బుధవారం ఉదయం 7.30గంటలకు చేరుతుంది. పొడనూరుకు శుక్రవారం తెల్లవారుజామున 3.45 గంటలకు చేరుతుంది. కాగా బారౌనీ-పొడనూరుల మధ్య గల 2,528 కిలోమీటర్ల దూరాన్ని ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు 2రోజుల 2గంటల 40 నిమిషాలు ప్రయాణించి గమ్యస్థానాన్ని చేరుతుంది.

ఈ రైలులో సెకండ్ ఏసీ బోగీ ఒకటి, థర్డ్ ఏసీ బోగీలు 3, స్లీపర్ క్లాస్‌బోగీలు, ఎస్‌ఎల్ఎండీ బోగీలు 2 వెరసి 23 బోగీలతో ప్రయాణించనుంది. ఈ రైళ్లలో వివిధ ప్రాంతాలకు ప్రయాణించేవారు రిజర్వేషన్ టిక్కెట్ల కోసం సమీప రైల్వే స్టేషన్లలోని బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి అందిన ఉత్తర్వుల్లో కోరారు.

ప్రకృతి సాగును విస్తరించాలి

- పీఎండీఎస్, డ్రమ్ షోయింగ్ పద్ధతులపై దృష్టి సారించాలి
- రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



అనపర్తి సావరంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న విజయకుమార్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డెల్టాలోని రైతులు ప్రకృతి వ్యవసాయంలో మెరుగైన పద్ధతులను పాటించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని రైతు సాధికారత సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం బొమ్మూరు కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు మాట్లాడుతూ వ్యవసాయంలో తాము అమలు చేస్తున్న పద్ధతులు, వాటి ప్రభావం, మార్కెటింగ్ విధానాలపై చర్చించారు. పంటల్లో వైవిధ్యం, మల్చింగ్, జీవామృతం వినియోగం ప్రీమాన్‌సూన్ డ్రై షోయింగ్(పీఎండీఎస్) పద్ధతులను పాటించడం వల్ల వచ్చిన మార్పులను వివరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కలుపు నియంత్రణకు రసాయన మందులు వాడడం వల్ల ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో కలుపు సమస్య ఎదుర్కోవడానికి మల్చింగ్, సన్నని వరుసల సాగు, డ్రమ్ సీడ్ షోయింగ్ పద్ధతులు ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా రైతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు తగు సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయం రైతుల పెట్టుబడిని తగ్గిస్తూ ఆదాయాన్ని పెంచుతుందని పశువులకు సంవత్సరం పొడవునా పచ్చి మేత లభిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఏపీసీఎంఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అనపర్తి సావరంలో క్షేత్ర సందర్శన

అనపర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఇదిలా ఉండగా విజయకుమార్ అనపర్తి సావరంలో ప్రకృతి సాగు చేపట్టిన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. పంట పొలాలను పరిశీలించి సాగుపై వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా మట్టిలో సారం పెరుగుతుందని, నీటి వినియోగం తగ్గుతుందన్నారు. ఖర్చులు తగ్గడమే కాకుండా ఆరోగ్యాలను కాపాడుకునే వీలు ఏర్పడుతుందనే విషయాలను రైతులకు చేరవేసి ప్రకృతి వ్యవసాయం విస్తరించే విధంగా అధికారులు కృషి చేయాలని విజయకుమార్ పేర్కొన్నారు.

ఉప్పాడ తీరం.. కల్లోలం!

ఎగసిపడుతున్న కెరటాలు

వేట విరమించిన మత్స్యకారులు



కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

కొత్తపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంపై చూపుతోంది. వాతావరణంలో ఏర్పడిన మార్పు లతో తీరం కల్లోలంగా మారి కెరటాలు ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డును తాకుతున్నాయి. దీంతో కొత్తపట్నం- సుబ్బంపేట మధ్య బీచ్‌రోడ్డు కోతకు గురవడంతో వాహనాల రాక పోకలకు అంతరాయం ఏర్పడుతుంది. బీచ్‌రోడ్డుకు రక్షణగా ఏర్పాటుచేసిన రాళ్లు కెరటాల ధాటికి సముద్రంలో కొట్టుకుపోతున్నాయి. మయాపట్నం, సూరాడపేట మత్స్యకార ప్రాంతాల్లో కెరటాలు ఇళ్ల ముంగిట్లోకి దూసుకుపోతున్నాయి. మత్స్యకార కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. కెరటాల తీవ్రత అధికంగా ఉండడంతో ఉప్పాడ నుంచి కాకినాడ వాహనాలపై వెళ్లే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రికి సముద్రం మరింత ఉధృతంగా మారే పరిస్థితి ఉండటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ సిబ్బందితో బీచ్‌రోడ్డులో వాహనాల రాక పోకలను నియంత్రించే చర్యలు చేపట్టారు. కాగా అల్పపీడన ప్రభావంతో తీరప్రాం తాలకు చెందిన మత్స్యకారులు స్వచ్ఛందగా వేట విరమించారు.



సుబ్బంపేట వద్ద కోతకు గురైన బీచ్‌రోడ్డు

పొంగి పొర్లుతున్న వాగులు

చింతూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో మళ్లీ ముసురు పట్టింది. మంగళవారం రోజంతా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఎగువనున్న ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలో కూడా ఇదే పరిస్థితి ఉండి ఉండడంతో ఆ నీరంతా శబరి, సీలేరు నదుల్లోకి చేరుతోంది. చింతూరు మీదుగా ఛత్తీస్‌గఢ్ వెళ్లే 30 నంబరు జాతీయ రహదారిపై తేంగ్‌పాల్, జీదం ఘాట్ తదితర ప్రాంతాల్లో వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. చింతూరు, వరరామచంద్రపురం మండలాల నడుమ జల్లివారిగూడెం వాగు పొంగి ప్రవహిస్తోంది. చింతూరు, భద్రాచలం నడుమ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన పలు కల్వర్టుల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగక పోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి వాహనదారులు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి ఉంది. అదే దశలో చింతూరు మీదుగా ఒడిస్సా వెళ్లే 326 నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు కూడా నత్తనడకన నడుస్తుండడంతో ఆ దిశగా కూడా ప్రయాణం కష్టతరంగా మారింది.



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా తోంగ్ పాల్ సమీపంలో రహదారిపై వరద నీరు



పొంగి ప్రవహిస్తున్న జల్లివారిగూడెం వాగు

అల్లూరి కలెక్టర్, రంప ఐటీడీఏ పీవోకు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి మహిళ మృతి వ్యవహారం

రంపచోడవరం/వై.రామవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి ఓ గిరిజన మహిళ మృతి చెందిన వ్యవహారంలో అల్లూరి జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. ప్రసవం కోసం 14 రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలోనే రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఉన్న తన భార్య కాకూరి పార్వతి(26) పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి మృతికి కారణమయ్యారని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని అనాథలుగా మిగిలిన తన ఇద్దరు పిల్లలకు న్యాయం చేయాలంటూ వై.రామవరం మండలం జాజిగడ్డకు చెందిన పడాల దుర్గాప్రసాద్ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. జూలై 11న కాకూరి పార్వతి ప్రసవ సమయంలో మెరుగైన వైద్యం అందక ప్రాణాపాయస్థితికి చేరుకోవడంతో ఆమెను రాజమండ్రికి తరలించి ఇక్కడి వైద్యులు చేతులు దులుపేసున్నారని, గిరిజనులకు అండగా నిలవాల్సిన రంపచోడవరం ఐటీడీఏ కూడా గిరిజన మహిళ నిర్లక్ష్య మృతిపై సరిగా స్పందించలేదని కూడా ఫిర్యాదులో ఆరోపించాడు. ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించిన కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులకు నోటీసులు జారీ చేసి అభియోగాలపై తీసుకున్న చర్యల నివేదికను 15రోజుల వ్యవధిలో తమకు సమర్పించాలని కమిషన్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ రెడ్డి ఆదేశించారు. లేకపోతే చట్టపరంగా చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

మనస్తాపంతో రైతు మృతి

దేవదాయశాఖ భూమిలో సాగుచేయరాదని నోటీసు



చంద్రరావు (ఫైల్)

కొత్తపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స లో సీతారామ స్వామికి సర్వే నంబరు 121/122లో 20 ఎకరాల భూమి ఉంది. ఆ భూముల్లో కొమరగిరికి చెందిన సుమారు 40మంది రైతులు ఎంతోకాలంగా సాగుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో దేవుడి కి చెందిన భూముల విషయంలో రైతులు, దేవ దాయశాఖ మధ్య వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. దీంతో ఆ భూముల్లో పలువురు రైతులు తొలకరి సాగు చేపట్టడంతో భూముల విషయం కోర్టులో ఉందని ఎవరూ పంటసాగుచేయరాదని ఇటీవల అధికారులు నోటీసులు జారీ చేశారు. ఐతే కొమరగిరికి చెందిన కండిపల్లి చంద్రరావు (70) సోమవారం దేవదాయశాఖ భూమిలో సాగుచేయడానికి వీలులేదని వీఆర్వో నోటీసుల జారీ చేశారు. ఆ సమయంలో చంద్రరావు మనస్తాపంతో కుప్పకూలి మృతి చెందినట్టు సహచర రైతులు తెలిపారు. చంద్రరావుకు రైతు సంఘం, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

భజనల మాస్టారు నాగేశ్వరరావు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

సామర్లకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భజనల మాస్టారుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పేరొందిన శ్రీ వెంకటేశ్వరా ఆధ్యాత్మిక కళాకారుల సంఘం వ్యవస్థాపకులు పెండాల్య నాగేశ్వరరావు(85) మాస్టారు చికిత్స పొందుతూ మృతిచెందారు. ప్రభుత్వ పాఠశాలల్లో 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన నాగేశ్వరరావు మాస్టారు పదవీ విరమణ అనంతరం గత రెండున్నర దశాబ్దాలుగా కాకినాడ జిల్లా వేట్లపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపకులుగా ఆధ్యాత్మిక సేవలు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాలకు విస్తరింపజేసారు. వేలాది భజన సంఘాలను తయారుచేసి ఆలయాల్లో జరిగే భజనల పోటీల్లో పాల్గొనేలా ఉత్తమ శిక్షణ ఇచ్చారు. ఇటీవల అమరావతిలో టీటీడీ వేంకటేశ్వ రస్వామి ఆలయంలో పెద్దఎత్తున భజనలు నిర్వహించేందుకు అనుమతులు సైతం పొందారు. 10రోజుల క్రితం వేట్లపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు మాస్టారు గుండెపోటుతో మృతిచెందారు. మంగళవారం తూర్పగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ శ్మశాన వాటికలో నాగేశ్వరావు మాస్టారి అంత్యక్రియలు నిర్వహించారు. భజనసంఘాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు సంతాపం వ్యక్తం చేశారు.

'ఏలేరు'లో పెరుగుతోన్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతోన్నాయి. మెస్తారు వర్షాలు, గోదావరి జలాలు విడుదలతో రిజర్వాయర్‌లో నీరు పెరుగుతోంది. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1050 క్యూసెక్కులు ఏలేరుకు విడుదలవుతున్నాయి. దీంతో ప్రాజెక్టులో 80.01 మీటర్ల స్థాయిలో 13.47 టీఎంసీల నిల్వలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు.



ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

రైలు ఢీకొని రైల్వే కార్మికుడి మృతి



మృతిచెందిన సత్యనారాయణ

సామర్లకోట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి కాకినాడ-విశాఖ బైపాస్ రైల్వే ట్రాక్‌పై విధి నిర్వహణలో ఉన్న సామర్లకోటకు చెందిన బంకపల్లి సత్యనారాయణ (44) అనే రైల్వే కార్మికుడిని మంగళవారం వేగంగా వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సామర్లకోట రైల్వే ఎస్ఎస్ ఎం.రమేష్ అందించిన సమాచారం మేరకు...పిఠాపురం రైల్వే సెక్షన్‌లో పనిచేస్తున్న సత్యనారాయణ ట్రాక్‌పై విధుల నిర్వహణలో వెనుక నుంచి రైలు రావడాన్ని గుర్తించలేకపోవడంతో ప్రమాదం సంభవించినట్టు రైల్వే పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపారు.

యూరియా... అగచాట్లు ఏంటయ్యా!

వర్షంలోనే గొల్లప్రోలు సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు



గొల్లప్రోలు సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు



గొల్లప్రోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు అగచాట్లు తప్పడం లేదు. ఇటీవల భారీ వర్షాలు, వరదల అనంతరం యూరియాకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. ముంపునకు గురైన పొలాల్లో బూస్టర్ డోస్‌గా యూరియా వేయాలన్న వ్యవసాయశాఖ సూచనలు, అదే సమయంలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతుండడంతో ఎరువు వేయాల్సిన అవసరం ఏర్పడింది. కొద్ది రోజులుగా యూరియా ప్రవేటు దుకాణాల్లో అందుబాటులో లేకపోవడంతో సొసైటీలు, రైతు సేవా కేంద్రాలపైనే రైతులు ఆధారపడుతున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు సొసైటీ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. దీంతో సోమవారం రాత్రి 20 టన్నులు, మంగళవారం ఉదయమే మరో 20 టన్నుల యూరియాను గొల్లప్రోలు సొసైటీకి పంపారు. యూరియా వచ్చిందన్న సమాచారంతో రైతులు తెల్లవారుజాము నుంచే సొసైటీ వద్ద బారులు తీరారు. సుమారు అరకిలోమీటరు మేర రైతులు క్యూలో నిలుచున్నారు. రైతుకు రెండు బస్తాలు వంతున పంపిణీ చేశారు. వర్షం పడుతున్నా లెక్కచేయకుండా రైతులు బారులు తీరడం గమనార్హం. యూరియాకు ఎటువంటి కొరత లేదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ స్పష్టం చేశారు. గొల్లప్రోలు సొసైటీ వద్ద రైతులు బారులు తీరిన విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం ఇక్కడకు చేరుకుని దగ్గరుండి రైతులకు యూరియా పంపిణీ చేయించారు. వర్మ వెంట టీడీపీ గొల్లప్రోలు పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు తదితరులు ఉన్నారు.

పేలిన గ్యాస్ బండ

పరుగులు తీసిన జనం

మురమళ్లలో తప్పిన పెను ప్రమాదం



ఐ.పోలవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల 216 జాతీయ రహదారిని ఆనుకుని మాణిక్యాంబా అమ్మవారి ఆలయం వద్ద సోమవారం రాత్రి గ్యాస్ బండ పేలడంతో జనం భయంతో పరుగులు తీశారు. రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదం జరగడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఐ.పోలవరానికి చెందిన బొలిశెట్టి సత్యశ్రీనివాస్ మాణిక్యాంబ గుడి సెంటర్‌లో మిర్చి బండి వ్యాపారం చేసుకుంటున్నాడు. సోమవారం రాత్రి ఎప్పటి మాదిరిగానే రాత్రి 9.30 గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి దుకాణంలోని గ్యాస్ బండ పేలి రోడ్డుపైకి ఎగిరిపడింది. భారీ శబ్దంతో పాటు రహదారిపై మంటలు వ్యాపించడంతో ప్రయాణికులు, స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఎస్ఐ రవీంద్రబాబు, ముమ్మిడివరం అగ్నిమాపక దళం సంఘటనా స్థలికి చేరుకుని మంటలు నియంత్రించారు. ఈ ప్రమాదంలో మిర్చి బండితో పాటు ఒక జోళ్ళ షాపు దగ్ధమైంది.



గ్యాస్‌బండ పేలుడుతో సంభవించిన మంటలు, దగ్ధమైన దుకాణాలు

ఆ కట్టడం అన్నవరానిదే..!

కొండను ఆనుకుని ఉన్న ప్రైవేట్ నిర్మాణం

దేవదాయశాఖ, ఇరిగేషన్ శాఖల మధ్య పంచాయితీపై సర్వేలో వెల్లడి



దేవస్థానం, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్న సర్వే

అన్నవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం కొండను ఆనుకుని ఉన్న ప్రైవేట్ నిర్మాణం విషయంలో దేవదాయశాఖ, ఇరిగేషన్ శాఖల మధ్య వివాదంపై మంగళవారం సర్వే నిర్వహించగా వివాదాస్పద కట్టడం దేవస్థానం పరిధిలోనిదేనని రెవిన్యూ, సర్వే అధికారులు తేల్చిచెప్పినట్టు దేవస్థానం అధికారులు వెల్లడించారు. గత 15 ఏళ్లుగా ఈ నిర్మాణంపై వివాదం చెలరేగుతూనే ఉన్నా సర్వే అధికారులు సర్వే చేపట్టి ఏమీ తేల్చకుండా ఉండడంతో తరచూ దీనిపై రాద్ధాంతం జరుగుతూనే ఉంది. ఈ స్థలం ఇరిగేషన్ పరిధిలోనిదే అంటూ ఇరిగేషన్ అధికారులు, దేవస్థానం పరిధిలోనిదే అని అన్నవరం దేవస్థానం అధికారులు పేర్కొంటున్నా కొలిక్కిరాలేదు. దీనిపై జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలతో ల్యాండ్ సర్వే ఏడీఈ ఆధ్వర్యంలో పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పర్యవేక్షణలో సర్వే చేశారు. పంపా రిజర్వాయిర్ గట్టును ఆనుకుని లోపలకి సుమారు 70 అడుగులు దేవస్థానానికి చెందినట్టు అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు. దీంతో నిర్మాణమంతా దేవస్థానం పరిధిలోకి వస్తుందని ఈఈ తెలిపారు. ఈ సమయంలో వివాదాస్పద కట్టడం యజమాని హరిగోపాల్ దీనిపై స్టే ఉందని తెలపడంతో ఆర్డీవో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది 2 శాఖల మధ్య వివాదమని థర్డ్‌పార్టీ ప్రమేయం ఉండకూడదని హెచ్చరించారు. సర్వేలో దేవస్థానం ఈవో సుబ్బారావు, ఈఈ రామకృష్ణ, లీజుల విభాగం అధికారులు, ఇరిగేషన్ ఈఈ శేషగిరి తదితరులున్నారు. దీనికి సంబంధించి కాగితాలు ఆర్డీవో కార్యాలయానికి తీసుకురావాలని సూచించారు. అయితే అన్నవరం దేవస్థానానికి చెందిన స్థలమేనని ప్రాథమిక నిర్ధారణకు రావడంతో ఈసారైనా దీనిని దేవస్థానం స్వాధీనం చేసుకుంటుందో లేదో వేచిచూడాలి.

పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టరనే ఆందోళనతో..

యువకుడి ఆత్మహత్య

కలుపుమందు తాగిన వైనం

సీతానగరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం సింగవరం గ్రామానికి చెందిన బిట్ర సూరిబాబు (24) కలుపు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల ప్రకారం.. సూరిబాబు రాజమహేంద్రవరం ఆసుపత్రిలో వరి బీజం ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆందోళనగా ఉంటున్నాడు. ఆ ఆపరేషన్ వల్ల పెళ్లి చేసుకుంటే పిల్లలు పుట్టరనే ఆందోళనతో మానసిక వేదనకు గురై సోమవారం సాయంత్రం గ్రామంలోని పామాయిల్‌తోటలోకి వెళ్లి కలుపుమందు తాగాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానని, కలుపుమందు తాగేశానని కోట సతీష్ అనే వ్యక్తికి చెప్పగా అతడు ఉప్పల దుర్గాప్రసాద్‌కు చెప్పాడు. అతడు విషయాన్ని సూరిబాబు కుటుంబ సభ్యులకు చేరవేశాడు. దీంతో బంధువులు, స్నేహితులు పామాయిల్ తోటకు వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న సూరిబాబును సీతానగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. ఈ మేరకు సూరిబాబు తండ్రి బిట్ర శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

పంటకాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

అనుమానాస్పద మృతిగా కేసు



మరణించిన చిన్న (ఫైల్)

కొత్తపేట/అంబాజీపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముక్కామల- ఈదరపల్లి పంట కాలువలో వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలోని కొర్లపాటివారి పాలానికి చెందిన మేడిది రంగాజానకీ ప్రసాద్(చిన్న) (55) సోమవారం రాత్రి కొత్తపేట మండలం గొలకోటివారిపాలెం ప్రధాన పంటకాలువలో గల్లంతయ్యాడు. మృతదేహం పాలగుమ్మి బల్లకట్టురేవు వద్ద మంగళవారం సాయంత్రం లభ్యమైంది. దీనిపై అతడి సోదరుడు మేడిది శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొర్లపాటివారిపాలెంలో విషాదఛాయలు

అందరితో కలిసిమెలిసి ఉండే మేడిది రంగాజానకీప్రసాద్ (చిన్న) మృతితో కొర్లపాటివారిపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంబాజీపేట పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్‌గా, కొబ్బరి వ్యాపారి, టీడీపీలో క్రియాశీలక సభ్యుడిగా చిన్న పనిచేశారు. అంతేకాకుండా కొర్లపాటివారిపాలెంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. మృతుడు చిన్నకు భార్య పావనిరాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఎంఎస్ చదువుతున్నాడు. చిన్న మృతికి టీడీపీ నాయకులతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఆబోతుల పోట్లాట.. గాయపడ్డ వ్యక్తి మృతి

అల్లవరం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుండెపూడి ఆంజనేయస్వామి గుడి వద్ద ఆబోతులు పోట్లాడుకుంటుండగా పక్కనున్న జంగా రామకృష్ణపై(41) అవి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని గ్రామస్తులు తెలిపారు. రామకృష్ణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపు 'నిధి ఆప్‌కే నికత్'

రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌వో రీజనల్ కార్యాలయం పరిధిలో గురువారం నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఎంప్లాయర్ అవేర్‌నెస్ థీమ్‌తో నిర్వహిస్తున్నామని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి కాతేరులోని తిరుమల స్కూల్, కోనసీమ జిల్లా-తాళరేవు మండలంలోని సుంకర పాలెంలో ఉన్న రవి జూనియర్ కళాశాల, కాకినాడ జిల్లా-అన్నవరం దేవస్థానం, పశ్చిమ గోదావరి జిల్లా- భీమవరం జగదీశ్ మెరైన్, ఏలూరు జిల్లా- వంగూరులోని గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి రంపచోడవరంలోని లెనోరాలో నిధి ఆప్‌కే నికత్ జరుగుతుందన్నారు. సభ్యులకు ఈసీఆర్, రిటర్నులపై అవగాహన, కేవైసీ, సభ్యుల వివరాలను సరిచేయడం, డిజిటల్ సిగ్నేచర్ వంటి సేవలు ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్య

తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలింపు

కేసు నమోదు

రావులపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్యపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన మట్టా ఎంజాలీనాజనీఫర్ తామస్ భర్త మట్టా శ్రీనివాస్‌తో నివసిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతీ రోజు తాగి వచ్చి వేధింపులకు గురి చేస్తుండడంతో ఈనెల 25న అర్ధరాత్రి నిద్రిస్తున్న భర్తపై అప్పటికే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలైన శ్రీనివాస్‌ను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమణరెడ్డి తెలిపారు.

స్కూటీ తాళం బద్దలు కొట్టి రూ.1.60 లక్షలు చోరీ

పిఠాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద స్కూటీ డిక్కీ తాళాలు బద్దలు కొట్టి నగదు చోరీ సంఘటన సంచలనం కలిగించింది. పిఠాపురం మండలం గోకివాడ మాజీ సర్పంచ్ బిళ్లకుర్తి రాంబాబు కుమారుడు నాగబాబు సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని బ్యాంకుకు వెళ్లి రూ.1.60 లక్షలు డ్రా చేశాడు. ఆ నగదును స్కూటర్ డిక్కీలో పెట్టి తాళం వేసి పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో తన బంధువు మరణ ధృవీకరణపత్రం కోసం వెళ్లాడు. కార్యాలయం లోపలకు వెళ్లి తిరిగి వచ్చి చూసుకునేసరికి స్కూటీ డిక్కీ తాళాలు బద్దలు కొట్టి తెరిచి ఉండటాన్ని గమనించాడు. లోపల ఉన్న నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని సీసీ కెమెరాలు పరిశీలించగా పనిచేయడం లేదని తేలింది. దీంతో బ్యాంకు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ గల సీసీ కెమేరాలను పరిశీలన చేస్తున్నారు. నాగబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

గొల్లప్రోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో వాటర్ ట్యాంకర్ బోల్తాపడింది. పట్టణంలోని జగనన్నకాలనీకి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మంగళవారం కాలనీకి వెళ్లిన ట్యాంకరు అదుపుతప్పి బోల్తాపడింది. ట్యాంకరుపై ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో బోల్తా పడిన ట్యాంకర్‌ను పైకి లేపి తిరిగి యథావిధిగా తాగునీటి సరఫరాను కొనసాగించారు.



గొల్లప్రోలులో బోల్తాపడిన ట్యాంకర్

మార్కెట్‌కు చవితి శోభ

పూజా సామగ్రి విక్రయాలు
వినియోగదారులతో రద్దీ
ఆకాశాన్నంటిన ధరలు
ట్రాఫిక్ ఇబ్బందులు


బిక్కవోలులో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

రాజానగరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాజానగరంలోని ప్రధాన రహదారి రద్దీగా మారింది. పూజా సామగ్రి, పండ్లు విక్రయదారులతో బస్టాండ్, మార్కెంట్ ప్రాంతాలు చవితి శోభను సంతరించుకున్నాయి. పూజా సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు సామగ్రి కొనుగోలకు రాజానగరం మార్కెట్‌కు వస్తారు. అసలే చవితి సందడి, ఆపై ప్రతి మంగళవారం జరిగే వారపు సంత కావడంతో మరింత రద్దీగా మారింది. మార్కెట్ ప్రాంతంలో నెలకొన్న రద్దీతో ప్రయాణికులు, వాహనదారులు పడరాని పాట్లు పడ్డారు. వ్యాపారులు, కొనుగోలుదారుల వాహనాలతో స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యను సరిదిద్దాల్సిన పోలీసులు బస్టాండ్, మార్కెట్ ప్రాంతం వైపు కన్నెత్తి చూడలేదని పలువురు వాపోయారు. నిత్యం రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతంలో పర్వదినాలు, సంత రోజుల్లోనైనా కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు, ప్రయా ణికులు కోరుతున్నారు.

చుక్కలనంటిన ధరలు..

బిక్కవోలు, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): వినాయక చవితి సందర్భంగా పత్రి, పూజా సామగ్రి ధరలు చుక్కలనంటాయని భక్తులు వాపోతున్నారు. గత యేడాది కన్నా ఈ యేడాది ధరలు విపరీతంగా పెంచేశారన్నారు. పాలవెల్లి రూ.100, పాలవెల్లికి కట్టే సీతాఫలం రూ.15, ఎలక్కాయ రూ.15, మారేడు రూ.20, జామ రూ.10, నారింజ రూ.15, కలువ పువ్వు రూ.5, యాపిల్, బత్తాయిలు రూ.25 చొప్పున అమ్ముతు న్నార న్నారు. దీంతో పాలవెల్లికి గతంలో మూడుచొప్పున కట్టే వాటిని ఒకటితో సరిపెట్టుకుంటున్నామని భక్తులు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే బత్తుల


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకునేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. నియోజకవర్గంలోని కోటి, కణుపూరు,రాజంపేట, నరేంద్రపురం తదితర గ్రామాల్లోని మత్స్యకార సంఘాల సభ్యులు, అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యశాఖ అధికారులు సంఘాల పని తీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే సభ్యత్వాల ఆన్‌లైన్ నమోదు వంటి విషయాల్లో జాగ్రత్తలు వహించాలని సూచించా రు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారులు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన పెంచుకోవాలి

డాక్టర్ ఈశాజ్యోతి

అనపర్తి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఈశాజ్యోతి అన్నారు. మంగళవారం రామవరంలో ఏర్పాటు చేసిన టీబీ ముక్త అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ క్షయ నిర్ధారణ కోసం ప్రతి పీహెచ్‌సీలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రోజుల తరబడి దగ్గు వస్తుంటే అశ్రద్ధ చేయవద్దన్నారు. డయాబెటిస్ ఉన్న వారు, పొగ తాగే వారు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా 200మందికి పరీక్షలు జరిపి 50 మంది కఫాన్ని పరీక్షల కోసం పంపించామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మీనాక్షి, హెచ్‌డీసీ చైర్మన్ మల్లిడి జీవన్‌రెడ్డి, ఎమ్‌పీహెచ్‌ఈవో సిహెచ్ శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం,మహేష్‌బాబు, లోకేశ్వరి, అచ్యుతాంబ పాల్గొన్నారు.

రాష్ట్ర పెన్షనర్ల బకాయిలను చెల్లించాలి

యర్రమోతు ధర్మరాజు

ధవళేశ్వరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఇవ్వాల్సిన వేత సవరణ బకాయిలు, కరువు భత్యం కిస్తీలు విడుదల చేయాలని ధవళేశ్వరం పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సమయానికి పెన్షన్‌లు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. పెన్షనర్లకు, ఉద్యోగులకు సుమారు రూ.30వేల కోట్లు బకాయి పెడితే ఇటీవల కూటమి రెండు దఫాలుగా రూ.9,500 కోట్లు చెల్లించినా పెన్షనర్లకు ప్రయోజనం చేకూరలేదన్నారు. బకాయిలు విడుదల చేయడంతో పాటు 12వ వేతన సవరణ కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో దువ్వూరి కామేశ్వర శర్మ, ఒర్రింకల సత్యనారాయణ, టి.కేశవ రావు, అరవ సత్యనారాయణ పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన గ్రీన్‌భద్రాద్రి బృందం

కడియం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారాముల ఆలయానికి గ్రీన్ భద్రాద్రిలో భాగంగా ఐదేళ్లుగా మొక్కలు ఉదారంగా ఇవ్వడం అభినందనీయమని గ్రీన్ భద్రాద్రి మేనేజర్ తిరుమలరావు అన్నారు. మంగళవారం పుల్లా అబ్బులు-సత్యదేవా నర్సరీని గ్రీన్ భద్రాద్రి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా తిరుమల రావు మాట్లాడుతూ పుల్లా అబ్బులు నర్సరీ నుంచి ఐదేళ్లుగా బద్రాచలం రామాలయానికి కావాల్సిన మొక్కలు పంపడంతో పాటు గ్రీన్‌భద్రాద్రిలో భాగస్వాములు అయ్యారన్నారు. ఈ సందర్భంగా అబ్బులును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుల్లా రాజశేఖర్, పుల్లా వీరబాబు తదితరులు ఉన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీలో వివక్ష చూపలేదు

కూటమి నాయకులు


జేసీ చినరాముడికి సమస్యను వివరిస్తున్న నాయకులు

కడియం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రతీ విషయాన్ని రాజకీయం చేయడం తగదని జేగురుపాడు ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, కూటమి నాయకులు అన్నారు. స్మార్ట్ కార్డుల విషయంలో ఎస్సీ, బీసీ కులానికి చెందిన వారిపై వివక్ష చూపుతున్నారంటూ సర్పంచ్ చేసిన ఆరోపణలను వారు ఖండించారు. ఐకమత్యంగా మెలిగే గ్రామంలో కులాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. సర్పంచ్ ఆరోపణలో వాస్తవం లేదన్నారు. మంగళవారం రాజేష్, రామకృష్ణ, కూటమి దళిత, బీసీ నాయకులు..జేసీ చినరాముడును కలిసి విషయాన్ని వివరించారు. వీఆర్వో ఈ నెల 24న సర్పంచ్‌కు ఫోన్ చేసి ఆహ్వానించారన్నారు.అందుకు సంబంధించిన ఫోన్‌కాల్ డేటా తమ వద్ద ఉందని, ఆ వివరాన్ని సమర్పించారు.ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మర్రెడ్డి రమేష్, కె.సూర్యకుమార్, ఎం.చంద్రమోహన్, జి.సతీష్, ఎం.భవానీప్రసాద్, కర్రి చినబాబు, పి.నాగేశ్వరరావు, బొబ్బా సూర్యభాస్కరావు, కె.గట్టియ్య ఉన్నారు.

అపశ్రుతులు జరగకుండా చూడాలి

అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నిమజ్జనాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అపశ్రుతులు జరగకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం కార్పొరేషన్ పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం కార్యక్రమాలు తదితర ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పందిళ్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధుల అభిప్రాయాలు సేకరించారు. సమీక్షలో కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకటరమణ, సిటీ ప్లానర్ కోటయ్య, ఎంహెచ్‌ఓ వినూత్న, మున్సిపల్, పోలీసు, ఫైర్, ఇరిగేషన్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

» విద్యాసంస్థల్లో వినాయక ప్రతిమలు తయారు చేసిన విద్యార్థులు
» పలువురికి పంపిణీ

మట్టి గణపతి.. మహా గణపతి


రాజమహేంద్రవరంలో ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజానగరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు విద్యా సంస్థల్లో చిన్నారులు పర్యావరణాన్ని చాటి చెబుతూ వివిధ ఆకృతుల్లో రూపొదిద్దుకున్న బుజ్జి బుజ్జి మట్టి గణనాథుల ప్రతిమలు అందరీ అబ్బురపరిచాయి. వివిధ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులంతా జీవం ఉట్టిపడేలా గణపయ్య మట్టి ప్రతిమలను తీర్చిదిద్దారు. వెలుగుబంద లోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులు హెచ్‌ఎం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏకో గణేష్ పేరిట పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం యర్రా ఆగ్నేశ్వరరావు, ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ మట్టి గణపతిని పూజించాలన్నారు. మట్టి ప్రతిమలు తయారు చేసిన చిన్నారులను ఎంఈవోలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. రాజానగరంలోని దివ్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ ఆకృతుల్లో మట్టి, వరి పిండి, కాగితాలతో గణపతి ప్రతిమలు, విగ్రహాలను రూపొందించారు. చిన్నారులు గణనాథుల వేషధారణలతో అలరించారు. దివ్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ బర్ల విజయ్, ప్రిన్సిపాల్ రామచంద్రరావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి ప్రతిమల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు పోటాపోటీగా మట్టి బొమ్మలను తయారు చేశారు. విద్యార్థులను వీసీ యు.చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

రంగంపేట: మండలంలోని వడిశలేరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు డ్రాయింగ్ టీచర్ మందపల్లి శిరీష శిక్షణలో మట్టితో గణపతి ప్రతిమలను తయారు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు దాట్ల అరుణ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటిలో కరగవని వాటి వల్ల చెరువులు, నదులు కలుషితమవుతాయని, మట్టి ప్రతిమలు నీటిలో కలిసిపోతాయని చెప్పారు. అలాగే రంగంపేట,సింగంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రాఫ్ట్ టీచర్ బి.లక్ష్మీ, వై.ప్రసన్న శిక్షణలో తయారు చేసిన మట్టి గణపతి ప్రతిమలను ఇన్‌చార్జి హెచ్‌ఎం వరలక్ష్మీ, ఎస్.జె.భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక వెంకటేశ్వర నగర్‌లోని జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. అధ్యక్షుడు వుండవల్లి సత్యనారాయణ, భానుప్రసాద్, శ్రీనివాసులు, తారక రామారావు, భైరవమూర్తి పాల్గొన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు 500 మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎస్‌ఐ అలీఖాన్, మహిళా రక్షకటీమ్ సభ్యుడు సతీష్‌బాబు, ప్రినిపాల్స్ డి.రామకృష్ణ, కెవిశ్రీరామ్, విమల, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ జీవీఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక సీసీసీ చానెల్, ఆర్తి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో రామాలయం సెంటర్ వద్ద మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో, చానల్ ఎండీ పంతం కొండలరావు, ప్రసాదుల హరనాథ్, బుడ్డిగ శ్రీనివాసు, అల్లు బాబీ, కృష్ణకుమార్, కోసూరి చండీప్రియ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుతో అనేక ప్రయోజనాలు

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


వెదురుపాకలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్ ఆధారిత రేషన్ కార్డుల ద్వారా వినియోగదారులకు అనేక ప్రయోజనాలు కల్గనున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని వెదురుపాక గ్రామంలో మంగళవారం ఆయన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రేషన్ వ్యవస్థలో సంస్కరణలకు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తోందన్నారు. లబ్ధిదారులకు సందేహాలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1967లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పిల్లా చంటిబాబు, అడపా భరత్, గాజింగం సత్తిబాబు, దాసరి తమ్మ న్నదొర, మంగరౌతు రాము, బొట్టా రామకృష్ణ, బత్తుల సారంగదరుడు, జి.భరత్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలోని 13వ డివిజన్ అంబేడ్కర్ నగర్‌లోని రేషన్‌షాపు సమీపంలోని లబ్ధి దారులకు స్మార్టు రైస్‌కార్డులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇంటింటికీ వెళ్లి అందజేశారు.


అంబేడ్కర్ నగర్‌లో కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా ప్రభుత్వం స్మార్టు కార్డులను పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి కప్పల వెలుగుకుమారి, నాయకులు కడలి రామకృష్ణ, మరుకుర్తి రవియాదవ్, బొర్రా చిన్ని, నగరబోయిన రామకృష్ణ, చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మానవతామూర్తి థెరిసా

నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య స్వామి
ఘనంగా మదర్ థెరిసా జయంతి

దివాన్‌చెరువు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పేదలు, రోగ పీడితులు, అనాథలే తన ఆస్తిగా భావించి వారిని అక్కున చేర్చుకున్న మానవతా మూర్తి మదర్ థెరిసా అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి అన్నారు. మదర్ థెరిసా జయంతిని మంగళవారం పలుచోట్ల నిర్వహించారు. నన్నయ వర్శిటీలో జరిగిన కార్యక్రమానికి రిజిస్ట్రార్ స్వామి విచ్చేసి థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, రమేష్, ఎన్.ఉదయభాస్కర్, పి.ఉమామహేశ్వరిదేవి, లింగారెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.గోపాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక వై.జంక్షన్‌లోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతిగృహం (ఆనంద నిలయం)లో థెరిసా చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవతకు, సేవాతత్పరతకు మదర్ థెరిసా ప్రతిరూపమని పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘాల జిల్లా అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, బిస్కట్ ప్యాకెట్లు అందజేశారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు తాళ్లూరి బాబూరాజేంద్ర ప్రసాద్, దారా ఏసురత్నం, జంగం సుబ్బారావు, అర్థాల కుమార్‌బాబు, ఆనంద నిలయం హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఇసుకపట్ల రాజేష్ పాల్గొన్నారు. మల్లయ్యపేట సెంటర్లోని థెరిస్సా విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సున్నా కృష్ణ, జేటీ రామారావు, బలరామనాయుడు, కె.రాజశేఖర్, సురేష్, పాల్గొన్నారు.

కడియం: మండలంలోని పొట్టిలంక గ్రామంలో లూథరన్ చర్చి ఆవరణలో మదర్‌థెరిసా సేవా సంఘం ఆధ్వర్యంలో థెరిసా చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ.నవీన్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో సేవా సంఘ అధ్యక్షుడు నక్కా వెంకటరత్నంరాజు, అర్థాల కుమార్‌బాబు, న్యాయవాది బడుగు సత్తిబాబు,నక్కా చంటిబాబు, కొల్లపు వీరన్న, కొండేపూడి చిన్ని, ఎస్.ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరంలో మదర్ థెరిస్సా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెదపాటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా విచ్చేసి థెరిసా చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన రక్తదాన శిబిరంలో 53 మంది రక్తదానం చేశారు.ఈ సందర్భంగా దివ్యాంగుడైన చిక్కాల శివ రామకృష్ణకు వీల్‌చైర్‌తో పాటు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పెందుర్తి దేవదాసు, గంటా శ్రీనివాసరావు, వలవల వెంకట్రాజు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ద్వారంపూడి రామకృష్ణ, చల్లమళ్ల సుజీరాజు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ఉత్సవ కమిటీ చైర్మన్ సాయిబాబారెడ్డి



బిక్కవోలు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం నిర్వహించే చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవ కమిటీ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, ఆలయ ఈఓ ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. భక్తులు స్వామి దర్శనానికి భారీ ఎత్తున క్యూలైన్లు ఏర్పాటు చేసామని, భక్తులు తడవకుండా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేసి ఆపైన రేకుల షెడ్డు కూడ నిర్మించామన్నారు. వచ్చే నెల 6 వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

ధవళేశ్వరంలో సర్వం సన్నద్ధం

ధవళేశ్వరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని వాడవాడలా వినాయక చవితి వేడుకలు నిర్వహించడానికి ఆయా కమిటీల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. చవితి పందిళ్లను విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో విఘ్నేశ్వర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రామపాదాల రేవు శివాలయం వద్ద జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో, జంగా వీధిలో మెండా రాజేష్ ఆధ్వర్యంలో, అంకాలమ్మ గుడి వద్ద యడ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో, అత్తిలి వారి వీధిలో కరుణాద్రి గణపతి ఆలయం వద్ద, కాటన్ బ్యారేజ్ సెంటర్‌లో సర్ ఆర్థర్ కాటన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పరుశురాముడు బోరింగ్ వీధిలో టీడీపీ నాయకుడు అడపా శ్రీను ఆధ్వర్యంలో తీర్చిదిద్దిన పందిళ్లలో గణపతి పూజలు అందుకోనున్నాడు.

సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జట్టుకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ఎంపిక



రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): త్వరలో నెల్లూరులో జరగబోయే జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే 'ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జట్టు'కు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బీఎస్సీ కంప్యూటర్స్ (ఆనర్స్) విద్యార్థిని సాయి మాధురి ఎంపికైంది. జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పోటీ పడే జట్టులో సాయి మాధురి ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు. కళాశాల స్పోర్ట్సు ఇన్‌చార్జి ఎం.ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు పీవీవీ లక్ష్మి, టి.విజయ్‌దుర్గతో కలసి ఆమెను అభినందించారు.

ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఉద్యోగులు, తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కదలి రావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయం నెంబర్70, 712 సచివాలయ ఉద్యోగులతో జరిగిన ఏపీజీఈఏ సమావేశానికి నగర సంయుక్త కార్యదర్శి కిరణ్మయి అధ్యక్షత వహించారు. ఉద్యోగుల వివిధ సమస్యల పరిష్కార మార్గాలను సంఘ సభ్యులతో చర్చించినట్టు గిరిప్రసాద్ తెలియజేశారు. సమావేశంలో సంఘ నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కార్మికులు తమ హక్కులు, సంక్షేమం కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ చెప్పారు. క్వారీ మార్కెట్ ప్రాంతంలోని శ్రామిక భవన్‌లో మంగళవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కార్మికులకు కల్పించిన హక్కులు, అసంఘటిత కార్మికులకు నల్సా న్యాయ సేవాపథకంలను వివరించారు.ఉచిత న్యాయ సహాయానికి డీఎల్‌ఎస్‌ఏని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎల్‌వో శేఖర్, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పద్యంతో పదసంపద మెదడులో నిక్షిప్తం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పద్యం నోటికి రావడం వల్ల తెలుగు భాషలో ఉన్న పద సంపద మెదడులో నిక్షిప్తమై ఉంటుందని నాటక కళాకారులు చేబియం సుబ్రహ్మణ్య మాస్టారు అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో తెలుగు సారస్వత పరిషత్, కళా గౌతమి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న తెలుగు మాటల పండుగ ఆరో రోజున పద్యనిధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య మాస్టారు, నాటక కళాకారులు డీఎస్పీ రావు మాట్లాడారు. పద్యాల ప్రత్యేకతను వివరించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 27 ఆగస్టు 2025 | 7



నేత..గణేశుడు!



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద ప్రతి ఏడాది గణేశుడిని వినూత్నంగా ఏర్పాటు చేస్తారు.. ఈ ఏడాది 18 అడుగుల గణేశుడి విగ్రహం ఏర్పాటు చేశారు. ఇందులో ప్రత్యేకత ఏమిటో తెలుసా.. ఈ విగ్రహం అంతా నూలు దారపు పోగులతో చేసినదే.. దీంతో ప్రత్యేక ఆకర్షణగా ఉంది.

దండాలయ్యా..ఉండ్రాలయ్యా!

రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా మార్కెట్లు కిటకిట లాడాయి. పండుగ శోభను సంతరించుకున్నాయి. సోమవారం కాస్త డల్‌గా ఉన్నా.. మంగళవారం గిరాకీ పెరగడంతో వ్యాపారుల్లో సంతోషం వ్యక్తమైంది. రాజమహేంద్రవరంలోని దేవీచౌక్, ఏవీ అప్పారావు రోడ్, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, రాజానగరం, బిక్కవోలు తదితర చోట్ల గ్రామాల నుంచి తెచ్చిన పత్రి, మారేడు, నారింజ, వెలగకాయ, గరిక, అరటి పిలకలు తదితర వాటిని విక్రయించారు. పూజాసామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. పాలవెల్లి రూ.వంద, పాలవెల్లికి కట్టే సీతాఫలం రూ. 15, ఎలక్కాయ రూ. 15, మారేడు రూ. 20, జామ రూ. 10, నారింజ రూ. 15, కలువ పువ్వు రూ.5, యాపిల్, బత్తాయిలు రూ.25 చొప్పున విక్రయించారు. కొబ్బరికాయ రూ.35లు పలికింది.అరటిపండ్లు డజను రూ.100లకు విక్రయించారు. ధరలు కాస్త ఎక్కువగా ఉన్నా వినాయకుడికి ఇష్టమైన వాటన్నింటినీ జనాలు సంచినిండా నింపుకొని వెళ్లారు. ఊరు వాడలా మండపాలు, పందిళ్లు వెలిశాయి. వివిధ రూపాల్లో ఉన్న గణపయ్య విగ్రహాలు ఆకర్షించాయి. మట్టి విగ్రహాలకు గిరాకీ బాగానే ఉంది. పర్యావరణ హితులు ఎక్కువగా మట్టి విగ్రహాలను తీసుకెళ్లారు. మధ్యాహ్నం వర్షం పడినా సాయంత్రానికి శాంతించడంతో మార్కెట్లు కళకళలాడాయి. స్వీట్ షాపులు కూడా రద్దీగానే కనిపించాయి. మామిడి ఆకుల కట్టను రూ.20కి విక్రయిస్తున్నా యి. 10 రకాల పూజా సామగ్రిని సెట్‌గా రూ.100 వరకూ అమ్మకాలు సాగించారు. ధరలు ఆ విధంగా ఉన్నా 'వరాలివ్వు బొజ్జగణేషా' అని వేడుకుంటూ పత్రి, పూజా సామగ్రిని జనం నిండుగా ఇళ్లకు తీసుకెళ్లారు. మరోవైపు వీధివీధిలో మండపాలు, పందిళ్లు వినాయక నవ రాత్రులకు సిద్ధమైపోయాయి. భారీ విగ్రహాల తరలింపు కన్నుల పండువగా జరిగింది.



పూజాసామగ్రి దుకాణాల వద్ద చవితి సందడి

తీగ లాగితే..



డ్రగ్స్ లింకులు!

రాష్ట్రంలో ఎక్కడ పట్టుబడినా మూలాలు ఇక్కడే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఏ మూల మాదక ద్రవ్యాలు దొరికినా మూలాలు తూర్పున కనిపిస్తున్నాయి. ఎక్కడో పట్టుబడిన గంజాయి వాసనకు జిల్లా కేంద్ర బిందువుగా మారుతోంది. చివరికి డ్రగ్స్‌లోనూ అదే తీరు కనిపిస్తోంది. తాజాగా హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్ కేసులో కీలక వ్యక్తిగా రాజమహేంద్రవరానికి చెందిన డిప్యూటీ తహశీల్దార్ మణిదీప్ వ్యవహారం మరింత చర్చకు తెరలేపింది. వైసీపీ ప్రభుత్వంలో గంజాయి, డ్రగ్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మూలన చర్యలు ఆరంభించింది. ఈగిల్ టీంను సిద్ధం చేసింది. దీంతో డ్రగ్స్ డొంకలు కదులుతున్నాయి. డిప్యూటీ తహశీల్దార్ డ్రగ్స్ వ్యవహారం కలకలం రేపుతోంది.

కమ్మేస్తున్న గంజాయి పొగ

ఎక్కడ పోలీసులు మాదక ద్రవ్యాలు పట్టుకున్నా ఉమ్మడి తూర్పుగోదావరితో ఏదొక లింకు ఉంటోంది. ఈనెల 16న నెల్లూరు బాలాజీనగర్ పీఎస్ పరిధిలో కారులో గంజాయి తరలిస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం రావడంతో రంగంలోకి దిగారు. కారు డ్రైవరు పోలీసులను ఢీకొట్టి కారుతో పరారయ్యే ప్రయత్నం చేశాడు. వెంబడించిన పోలీసులు రెండు రౌండ్లు కాల్పులు జరిపి ఒక వ్యక్తిని, 22 కిలోల గంజాయిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి రాజమహేంద్రవరానికి చెందిన బీరక ప్రకాశ్ అలియాస్ సూర్యప్రకాశ్ అని గుర్తించారు. ఈనెల 8న ధవళేశ్వరం ఐవో సీఎల్ కాలనీకి చెందిన సతీశ్ అదృశ్యమయ్యాడు. అతనితోపాటు రైళ్లలో సమోసాలు విక్రయించే స్నేహితులు గంజాయి తాగిన మైకంలో చంపేశారు. కుళ్లిన స్థితిలో ఆ యువకుడి శవం లభ్యమైంది. సుమారు రెండేళ్ల కిందట రాజమండ్రికి చెందిన ఓ యాంకర్ హైదరాబాద్‌లోని గంజాయి కేసులో ఆరోపణలు ఎదుర్కొన్నాడు. పోలీసులు ఏమీలేదని తీసి పారేస్తున్నా జరుగుతున్న ఘటనలు నిజమని రుజువు చేస్తున్నాయి. రాజమహేంద్రవరంతోపాటు గ్రామాలకు సైతం గంజాయి పాకేసింది. సిగరెట్లలో పొగాకు తీసేసి అందులోకి నేరుగా గంజాయి నింపి పెద్దఎత్తున విక్రయాలు జరుపుతున్నారు.



చుక్‌చుక్‌లో గప్‌చుప్‌గా

స్టూడెంట్స్ మాదిరిగా బ్యాగులు తగిలించుకొని రైళ్లలో గంజాయి ఆకు, పొడి, లిక్విడ్ రూపాల్లో హైదరాబాద్ పబ్‌లకు సరఫరా చేస్తున్నారు. దీనికి రాజమండ్రి, సామర్లకోట, తుని, అన్నవరం, అనకాపల్లి రైల్వే స్టేషన్లను ఎంచుకుంటున్నారు. విశాఖ వైపు నుంచే వచ్చే బొకారో, కోణార్క్, గువాహటి తదితర రైళ్లు గంజాయి రవాణాకు అనువుగా మారాయని ఇప్పటికే రైల్వే పోలీసులు గుర్తించారు. ఆ రైళ్లలో బోగీలు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటాయి. దీంతో తనిఖీలు చేయడం అసాధ్యం. గంజాయి తీసుకెళ్తున్నవాళ్లు హైదరాబాద్, బెంగళూరు వైపు వెళ్తారు. కొందరు విజయవాడలో దిగిపోయి చెన్నై లేదా చెన్నై వెళ్ల కుండా కాట్పాడి జంక్షన్ మీదుగా నేరుగా వెళ్లే రైళ్లను ఎంచుకొని సేలం, ఈరోడ్‌కు చేరుస్తున్నారు.

- గంజాయి,డ్రగ్స్ కేరాఫ్‌గా తూర్పు
- క్లాసుగా తిరుగుతూ దందాలు
- క్లాసులతో సరిపెడుతున్న పోలీస్
- సర్వనాశనమవుతున్న యువత
- పరారీలో డీటీ మణిదీప్..
- బెయిల్‌కి ముందస్తు ప్రయత్నం
- పసిగట్టడంలో నిఘా పడక
- మామూళ్ల మత్తులో పోలీస్

నిద్దరోతున్న నిఘా

జిల్లాలోని పోలీస్, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ వంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల్లో నిఘా నిద్దరోతున్నట్టుగా పరిస్థితులు చెబుతున్నాయి. ముఖ్యంగా పోలీస్‌కి సంబంధించి ప్రతి స్టేషన్‌లో ఒక నిఘా విభాగ పోలీస్ ఉంటారు. ఆ పీఎస్ పరిధిలోని అనుపానువులు పసిగట్టి స్పెషల్ బ్రాంచి అధికారులకు తెలియజేస్తే నేరుగా ఎస్పీ చెవికి చేరతాయి. అయితే పోలీస్ నిఘా వృత్తేతర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందనే విమర్శలున్నాయి. ఈగిల్ టీం, నిఘా విభాగం ఎవరి దారి వారిదే అన్నట్టుగా ఉన్నాయి. కనీసం నగరాలను ఆనుకొని ఉన్న ప్రాంతాల్లోని రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లలో జరుగుతున్న అసాంఘిక పార్టీలపై కూడా నిఘా ఉండడం లేదంటే.. ఆ పరిస్థితులే మణిదీప్ వంటి వారి దందాలకు ఊతంగా మారాయని చెప్పక తప్పదు. మరోవైపు ఎక్సైజ్ పోలీసులు మద్యం వ్యాపార ప్రక్రియలో బిజీగా ఉంటున్నారు.



హైదరాబాద్‌లో రేవ్ పార్టీలో డ్రగ్స్‌తో పట్టుబడిన యువత (ఫైల్)



స్నేహితులకు మెసేజ్

డీటీ..ఇదేంటి?

ఏపీ నుంచి వెళ్లి డ్రగ్స్‌తో రేవ్ పార్టీ చేసుకుంటున్న ఆరుగురిని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ వింగ్, గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రావులపాలెం, ఆలమూరు, రాజమహేంద్రవరానికి చెందిన వాళ్లే. వీళ్లను పట్టుకుని తీగ లాగితే ధవళేశ్వరం పోలవరం భూసేకరణ పరిపాలనా కార్యాలయంలో చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న మణిదీప్ డొంక కదిలింది. 2012లో కారుణ్య నియామకం కింద రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా జాయినైన మణిదీప్.. ఆర్‌ఐగా ఉన్న సమయంలో లంచం ఆరోపణలతో సస్పెన్షన్‌కి గురయ్యాడు. అనంతరం డ్రగ్స్ ముఠాలతో పరిచయాలు పెంచుకున్నాడు. ఏడాదికి మూడొంతులు హైదరాబాద్, ఊటిలోనే ఉంటాడు. విలాసవంతమైన పార్టీలను ప్యాకేజ్‌గా ఒప్పుకోవడం ప్రవృత్తిగా చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని రేవ్ పార్టీ పెట్టిన గెస్ట్‌హౌస్ కూడా ఇతనే రాజమహేంద్రవరం నుంచి బుక్ చేశాడని ప్రచారం జరిగింది. అలాగే మణిదీప్ తరచుగా నామవరం రోడ్‌లోని ఓ విలాసవంతమైన రిసార్ట్‌లో పార్టీలు పెట్టేవాడు. రాజానగరం తదితరచోట్ల ఉన్న రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లు ఇతడి చేతిలోనే పెట్టుకున్నాడని కూడా చెబుతారు. అలాగే రాజమహేంద్రవరం కేంద్రంగా గంజాయి లోకల్‌గా సమకూరుస్తూ ఖరీదైన డ్రగ్స్ కొకైన్, ఎండీఎంఎ వంటి వాటిని ముంబై, బెంగళూరు నుంచి తీసుకువస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇక రాజమహేంద్రవరం సమీపంలోను, రాజానగరం ప్రాంతంలోను మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలు ఎక్కువ. సుమారు 4 వేల మందిపైనే విద్యార్థులుంటారు. వీరిని లక్ష్యంగా చేసుకుని మధ్యవర్తుల ద్వారా డ్రగ్స్‌ని విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. మణిదీప్ తన రేవ్ పార్టీల సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. మణిదీప్ రకరకాల నిషేధిత డ్రగ్స్‌ని పరిచయం చేసి కుర్రాళ్లను నాశనం చేస్తున్నాడని ఆరోపిస్తూ ఒక వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా ప్రస్తుతం మణిదీప్ పరారీలో ఉన్నాడు. ముందస్తు బెయిల్ ప్రయత్నిస్తున్నాడని చెబుతున్నారు. తెలంగాణ పోలీసుల నుంచి సమాచారం వచ్చిన వెంటనే మణిదీప్ వద్దకు వెళ్లిన స్పెషల్ బ్రాంచి పోలీసులు అతడు చెప్పింది విని వెనుదిరగడం ఆరోపణలకు తావిస్తోంది. మణిదీప్‌కి ఎంతటి వారినైనా డబ్బుతో లొంగదీసుకోవడం అలవాటు కాబట్టి ఇప్పుడూ అదే జరిగి ఉంటుందనే విమర్శలున్నాయి. ఈ కేసుతో తనకు సంబంధం లేదంటూ తన స్నేహితులకు మణిదీప్ సోమవారం రాత్రి ఒంటి గంట సమయంలో వాట్సాప్ మెసేజ్ పెట్టడంపై వాళ్లే విస్తుపోతున్నారు.

10

మెగా డీఎస్సీ అభ్యర్థుల..

సర్టిఫికెట్లు రేపు పరిశీలన

ప్రసాదాలకు ప్లాస్టిక్ ప్లేట్లు వాడొద్దు

నోడల్ ఆఫీసర్ల సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మంచినీటి పైపులైను లీకులకు సంబంధించి పదే పదే ఫిర్యాదులు అందుతుంటే ఇంజనీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారని కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) పి.ప్రశాంతి ప్రశ్నించారు. నోడల్ అధికారులు ప్రతిరోజూ తప్పనిసరిగా తమకు కేటాయించిన వార్డుల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో వినాయక చవితి పందిళ్ల అనుమతులు, వార్డు సచివాలయాల పనితీరు, డ్రైనేజీ మేనేజ్‌మెంట్, డోర్ టు డోర్ చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, రెవెన్యూ కలెక్షన్, సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నిర్మూలన తదితర అంశాలపై నోడల్ ఆఫీసర్లుతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియకు సంబంధించి డంపింగ్‌యార్డులో కార్యక్రమాలు సరిగా జరగడంలేదన్నారు. వర్మి కంపోస్టు, తడి పొడి చెత్త సేకరణ సక్రమంగా లేదన్నారు. అనుమతుల్లేని ఫ్లెక్సీలను తొలగించడంలో తాత్సారం ఎందుకని ప్రశ్నించారు. వినాయక చవితి పందిళ్లకు సంబంధించి సచివాలయాల వారీగా నివేదిక అందించాలన్నారు. ప్రసాదాల పంపిణీకి ప్లాస్టిక్ ప్లేట్లను వినియోగించరాదన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులతో వారానికోసారి తప్పనిసరిగా రివ్యూ నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల సమయంలో డీటైల్డ్ నోట్ కచ్చితంగా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. నోడల్ అధికారులు అందరికీ వైర్‌లెస్ సెట్లను అందజేయాలని ఆదేశించారు. వినాయక చవితి నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, సెక్రటరీ శైలజ వల్లి పాల్గొన్నారు.

తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి : జేసీ

రాజమహేంద్రవరం రూరల్ 26(ఆంధ్రజ్యోతి): తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని జేసీ చిన్నరాముడు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, మండల తహశీల్దార్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారుల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయి అధికారుల పనితీరు జిల్లా అభివృద్ధి, ప్రగతిపై ప్రభావం చూపుతుందన్నారు. రెవెన్యూ అధికారులకు నిర్దేశించిన మండలాల పరిధిలో లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో 272 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి రీసర్వే ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో డీఆర్‌వో సీతారామమూర్తి, సర్వే అధికారి లక్ష్మీనారాయణ, ఆర్డీవోలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

573.66 క్వింటాళ్ల బియ్యానికి 30న వేలం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 573.66 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఈ నెల 30వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ (పౌరసరఫరాలు) ఛాంబర్ వద్ద ఉదయం 11 గంటలకు వేలం ప్రక్రియ జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనేవారు 29వ తేదీన జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఉన్న పీడీఎస్ బియ్యం శాంపిల్స్‌ను పరిశీలించవచ్చని తెలిపారు. 6ఏ కేసుల్లో నమోదై పెండింగ్‌లో ఉన్న వారు వేలం పాటలో పాల్గొనేందుకు అనర్హులు అని తెలిపారు.

త్రిమందిర్‌కు రూ.88 కోట్ల డీపీఆర్

బిక్కవోలు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తూర్పు చాళుక్యాస్ త్రిమందిర్ పేరుతో కేంద్ర పర్యాటక శాఖ ఆదేశాలతో రాష్ట్ర టూరిజం శాఖ తయారు చేసిన రూ.88 కోట్ల డీపీఆర్‌పై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం చర్చించారు. ముందుగా లక్ష్మీగణపతిని దర్శించి ఆలయ ఆవరణలో అధికారులతో చర్చించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బిక్కవోలులోని శ్రీలక్ష్మీగణపతి, శ్రీగోలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని శ్రీసూర్యనారాయణమూర్తి ఆలయాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర టూరిజం శాఖ రూ.88 కోట్లతో డీపీఆర్‌ను తయారు చేసిందన్నారు.గొల్లలమామిడాడలోని రామాలయాన్ని ఇందులో చేర్చగా ఆలయ యాజమాన్యం అంగీకరించలేదన్నారు. బిక్కవోలు కెనాల్‌రోడ్డులోని జోడినాదాల తూము నుంచి బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయం వరకూ బైపాస్ రోడ్డు నిర్మించి అక్కడ నుంచి గొల్లల మామిడాడ రోడ్డుకు కలుపుతారన్నారు. శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో భక్తులు ఉండేందుకు కాటేజీలు నిర్మిస్తారని, గోలింగేశ్వరస్వామి ఆలయం చుట్టూ అభివృద్ధి చేస్తారన్నారు. గొల్లల మామిడాడలోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో కల్యాణమండపం, కాటేజిలు నిర్మిస్తారన్నారు.

సమన్వయంతో పనిచేయండి

నాయకులు, కార్యకర్తలకు త్రిసభ్య కమిటీ సభ్యుల సూచన

కోరుకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. కోరుకొండ మండలం బూరుగుపూడి టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా పార్టీ సమావేశంలో పార్టీ అధినాయకత్వం నియమించిన త్రిసభ్య కమిటీలో సభ్యులైన మంత్రి కొలుసు పార్థసారథి, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు , కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ముందుగా జిల్లా కమిటీపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభి వృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై టీడీపీ నేతలకు, కార్యకర్తలకు అభిమానులకు దిశా నిర్దేశం చేశారు.మాజీ మంత్రి, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సహా అనుబంధ సంఘాలు, ఇతర కీలక పదవుల భర్తీపై జిల్లా పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. వినాయక చవితి తర్వాత పార్టీ అధిష్ఠానం తన నిర్ణయాలు వెలువరిస్తుందని స్పష్టం చేశారు.పార్టీ కోసం కష్టపడిన వారికి న్యాయం చేస్తామన్నారు. రాజానగరం టీడీపీ ఇన్‌చార్జ్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ కార్యకర్తలు బలంగా ఉంటే పార్టీ బలంగా ఉంటుందన్నారు.టీడీపీ జిల్లా నాయకత్వానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. పార్టీ పదవుల్లో రాజానగరం, నిడదవోలు నియోజకవర్గాలకు పెద్ద పీట వేయాలన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు మాట్లాడుతూ పార్టీ జెండా మోసిన వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఉండాలన్నారు. లీడర్‌కు క్యాడర్‌కు మధ్య బంధం పెరగాలన్నారు. కనీసం 15 ఏళ్లు మనం అధికారంలో ఉండాలన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొంత మంది కేవలం ఫేస్‌బుక్, వాట్సప్‌లో ఫొటోలు పెట్టి అధిష్ఠానం దృష్టిలో పడాలని చూస్తున్నారని అటువంటివారిని పక్కన పెట్టి భుజాలు అరిగేలా జెండాలు మోసిన కార్యకర్తలకు పెద్దపీట వేయాలన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ నిజమైన కార్యకర్తలకు సరైన గుర్తింపు ఇవ్వాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ 2014-19 చివరి దశలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. అనపర్తి టీడీపీ ఇన్‌చార్జ్ నల్లమిల్లి మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు బలంగా ఉంటేనే పార్టీకి మనుగడ ఉంటుందన్నారు.మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ పార్టీలో ఉంటూ వెనుక నుంచి గోతులు తవ్వే నాయకులకు మనుగడ ఉండదన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు.పార్టీలో ఎవరైనా నేను గొప్ప అని విర్రవీగితే కొమ్ములు విరుగుతాయన్నారు. అధికారులు ఇంకా నాయకులకు పార్టీకి సహకరించడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి ఆశిష్ లాల్, ఏఎంసీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవ రావు,అడపా వీరబాబు, కాంతారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు తదితరులు.. ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

టీడీపీ జిల్లా అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ

త్రిసభ్య కమిటీ ముందు 8 మంది పేర్లు ప్రతిపాదన

రాజమహేంద్రవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : టీడీపీ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ తీవ్రంగా ఉంది. చాలా మంది తనకు కావాలంటే తనకు కావాలని పోటీ పడడం గమనార్హం.చివరకు అధిష్ఠానం ఎవరికిచ్చినా సంతోషమే అనే అభిప్రాయం కూడా వెలువడినట్టు సమాచారం.జిల్లా అధ్యక్ష పదవితో పాటు ప్రధాన కార్యదర్శి ఇతర జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీలో జిల్లాకు స్థానం గురించి టీడీపీ అధిష్ఠానం త్రిసభ్య కమిటీని పంపిన సంగతి తెలిసిందే.త్రిసభ్య కమిటీలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఉన్నారు. మంగళవారం కోరుకొండ మండలం బూరుగుపూడిలోని టీడీపీ కార్యాలయంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో పాటు నియోజకవర్గానికి సుమారు 10 మంది వంతున ప్రత్యేక ఆహ్వానితుల అభిప్రాయాలు సేకరిం చారు. ఈ ముగ్గురు ఒక ప్రత్యేక గదిలో కూర్చుని ఒక్కొక్కరి అభిప్రాయాలు తీసుకున్నారు. మొదట ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డిరెడ్డి వాసు, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జిలు బీవీఆర్ చౌదరి, బూరుగుపల్లి శేషారావు, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అభిప్రాయాలు తీసుకున్నారు. గుడా మాజీ చైర్మన్ గన్నికృష్ణను లోపలికి ఆహ్వానించారు. అనంతరం ఒక్కో నియోజకవర్గం నుంచి 10 మందిని, ఆయా ఎమ్మెల్యేలు ఇన్‌చార్జిల సమక్షంలోనే పిలిచి అభిప్రాయాలు సేకరించారు. ఇందులో 8 మంది పేర్లు ప్రముఖంగా వినిపించినట్టు సమాచారం. రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తదితరుల పేర్లు పరిశీలనకు వచ్చినట్టు తెలిసింది. వీరిలో ఎవరో ఒకరు జిల్లా అధ్యక్షుడవుతారు. మిగిలిన వారిలో ఒకరిని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించే అవకాశం ఉంది. అనంతరం త్రిసభ్యకమిటీ సభ్యులు మాట్లాడుతూ అందరి అభిప్రాయాలు సేకరించామని వారు ప్రతిపాదించిన పేర్లను అధిష్ఠానానికి అందజేస్తామన్నారు. పనిచేసే ప్రతీ వ్యక్తికి గుర్తింపు ఉంటుందన్నారు. వినాయక చవితి వెళ్లిన తర్వాత జిల్లా టీడీపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు మొత్తం కమిటీని నియమించనున్నారు. ఇప్పటికే నియమించిన కమిటీలను అధికారికంగా ప్రకటించనున్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



కొవ్వూరు మెయిన్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన పూజా సామగ్రి

కొవ్వూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలుదారులతో కొవ్వూరు పట్టణంలోని ప్రదాన రహదారులు కోలాహలంగా మారాయి. ఉదయంనుంచి వర్షం కురవడంతో వ్యాపారాలు మందకొడిగా సాగాయి. మధ్యాహ్నం నుంచి వర్షం తెరుపు ఇవ్వడంతో ప్రజలంతా పూజా సామగ్రి కొనుగోలుకు బయటకు వచ్చారు. దీంతో మెయిన్‌రోడ్ వినియోగదారులతో కిటకిటలాడాయి. మంగళవారం కొవ్వూరు అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి విజయవిహార్ వరకు, కొవ్వూరమ్మ గుడి నుంచి జూనియర్ కాలేజ్, బస్టాండ్ సెంటర్ ఆంజనేయ స్వామిగుడి వద్ద చవితికి పత్రి, పండ్లు, పాలవెల్లువ వివిధరకాల పూజా సామగ్రి దుకాణాలు ఏర్పాటుచేశారు. ప్రజలు అధికసంఖ్యలో పూజా సామగ్రి కోసం రోడ్లపైకి రావడంతో రోడ్లన్నీ కోలాహలంగా మారా యి. పండుగను ఆసరాగా తీసుకుని వ్యాపారులు, పువ్వులు, పండ్ల ధరలను పెంచి విక్రయించడంతో సామాన్యులు పండుగ చేసుకోవాలంటే హడలెత్తిపోతున్నారు.

మార్కెట్లో చవితి సందడి

● పూజా సామగ్రి కొనుగోలుతో కిక్కిరిసిన రహదారులు

చాగల్లు(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాగల్లులో శ్రీగణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. చాగల్లు తెలగా సంఘం, చాగల్లు, నెలటూరు వర్తక సంఘంల వారి ఆధ్వర్యంలో వేర్వేరుగా వైభవంగా జరుగుతాయి. రాష్ట్రంలో పేరెన్నికగన్న రంగస్థల నటులు, సినీ నటులు, ఆధ్యాత్మిక ప్రవచం చెప్పే వారు ఈ ఉత్సవాల్లో పాల్గొని నవరాత్రి వేడుకలను రాష్ట్ర స్థాయిలోనే గుర్తింపు తీసుకొచ్చారు. ఈసందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమై తొమ్మిరోజుల పాటు నిర్వహిస్తారు. విద్యుత్ దీపాలతో ఏర్పాటుచేసే దేవతామూర్తుల బొమ్మలు ఆకట్టుకుంటాయి.

వర్షంతో వెలవెలబోతున్న వ్యాపారాలు

తాళ్లపూడి(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. వినాయక చవితి సందర్భంగా మంగళవారం ఏర్పాటుచేసిన వినాయక ప్రతి మలు, పూజా సామగ్రి వ్యాపారస్తులతో వర్షం దోబూచులాడింది. వర్షం ఆగినపుడు కొద్దిగా విక్రయాలు కొనసాగాయి. వర్షం కారణంగా కొనేవారులేక వ్యాపారస్తులకు ఇబ్బందులు తప్పలేదు. .

మెగా డీఎస్సీ సెలెక్టెడ్ అభ్యర్థులకు

రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

● కాల్ లెటర్ల జారీ ప్రారంభం

ఏలూరు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కాల్‌లెటర్ల జారీ ప్రారంభమైంది. తొలుత పీజీటీ, టీజీటీ కేడర్ సెలెక్టెడ్ అభ్యర్థుల లాగిన్‌లకు, మధ్యాహ్నంనుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ అభ్యర్థులకు కాల్‌లెటర్లు జారీకాగా, రాత్రికి ఎస్జీటీ కేడర్ అభ్యర్థులకు కాల్ లెటర్లు అందుతాయని భావిస్తున్నారు. అభ్యర్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం వట్లూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ వెంకటలక్ష్మమ్మ తెలిపారు. కాల్ లెటర్‌లో చేసిన సూచనలను అభ్యర్థులు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, మూడు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు తెచ్చుకోవాలన్నారు. వెరిఫికేషన్‌కు హాజరుకావడానికి ముందుగానే అభ్యర్థి అన్ని సర్టిఫికెట్లను ఏపీడీఎస్సీ. ఏపీసీఎఫ్ఎస్ ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో వ్యక్తిగత లాగిన్‌ల నుంచి అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నంబర్లు 9030723444, 9052391111లలో సంప్రదించాలని కోరారు. గురువారం జరుగనున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు జిల్లాల్లో ఏర్పాట్లపై పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు, రాష్ట్ర నోడల్ ఆఫీసర్లు మంగళవారంరాత్రి వెబెక్స్ విధానంలో డీఈవోలతో సమావేశం నిర్వహించారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాటుచేసిన ముగ్గురు గెజిటెడ్ అధికారులతో కూడిన టీమ్‌ల విధులపై సూచనలు చేశారు. జోన్-2 జిల్లాల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు రాష్ట్ర నోడల్ ఆఫీసర్‌గా ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డిని నియమించినట్టు వెల్లడించారు. సమావేశంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా

చవితి వేడుకలు జరుపుకోవాలి

● కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. గణేష్ మండపాలు ఏర్పాటుచేస్తున్న నిర్వాహకులకు మంగళవారం పట్టణ పోలీసులు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. సీఐ విశ్వం మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిర్వాహకులు ముందుగానే కమిటీలు ఏర్పాటుచేసుకుని అన్నిఏర్పాట్లకు పూర్తి బాధ్యత వహించాలి. పబ్లిక్ ప్రదేశాలలో, రోడ్లపై మండపం ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి పొంది ఉండాలన్నారు. మండపాల వద్ద ట్రాఫిక్‌కిగాని, ప్రజలకుగాని ఎటువంటి అంతరాయం కలుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. డీజే సౌండ్ బాక్సులకు అనుమతి లేదన్నారు. సాధారణ సౌండ్ బాక్సులు మాత్రమే వినియోగించాలన్నారు.

దేవరపల్లి(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాల్లో శాంతిభద్రతలకు భంగం కలుగకుండా వినాయకచవితి కమిటీలు సభ్యులు జాగ్రత్త వహించాలన్నారు. దేవరపల్లిలో కాకర్ల కల్యాణ మండపంలో మంగళవారం వినాయక చవితి ఉత్సవాలు, ఊరేగింపు, నిమజ్జనం, కార్యక్రమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ నాగేశ్వర్ నాయక్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహ న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీలు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్రహ్మణ్యం, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులకు దేవరపల్లి సీఐ నాయక్ సూచించారు. స్థానిక రెడ్డి ఫంక్షన్‌హాలులో మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు ఆయన మంగళవారం సూచించారు. ఎస్ఐ మనోహర్, ట్రైనీ ఎస్సై శివగణేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజించాలి: ఎమ్మెల్సీ వీర్రాజు



కొవ్వూరులో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

కొవ్వూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మ ట్టి గణపతులనే పూజించాలని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని గౌతమీనగర్‌లో పిల్లలమర్రి లక్ష్మీనారాయణశర్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ట్రస్టు నిర్వాహకులు పిల్లలమర్రి సర్వేశ్వరరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణలు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, దోర్బల ప్రభాకరశర్మ, తుట్టగుంట భైరవమూర్తి, కలిగొట్ల కృష్ణారావు, ఇనుగంటి ఉమారామారావు, కొప్పిరెడ్డి రాజబాబు, పిల్లలమర్రి లక్ష్మీనారాయణ శర్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. కొవ్వూరు మెయిన్‌రోడ్‌లో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పట్టణ సీఐ పి.విశ్వం ముఖ్యఅతిథులుగా పాల్గొని మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కాకి అనిల్‌సూర్య, కంకటాల రాంబాబు, మద్దుల సత్యనారాయణ, మద్దుల నాని, కొత్తమాసు వాసు, రమాకాంత్ పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

నిడదవోలు(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతే మహా గణపతి అని పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని కౌన్సిలర్ చిలకల శారదాదేవి అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేశారు. చిలకల మల్లిఖార్జునరావు ఉన్నారు.

తాళ్లపూడి(ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం వినాయక మట్టి ప్రతిమలు విద్యార్థులకు, గ్రామస్థులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్ధనరావు, సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వర బయోటెక్ ఆధ్వర్యంలో....

దేవరపల్లి(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టిప్రతిమలనే వినియోగించాలని దేవరపల్లి పరమేశ్వర బయోటెక్ ఎండీ ఆనంద్ స్వరూప్ పేర్కొన్నారు. దేవ రపల్లి మంగళవారం గ్రామ పురోహితులు పెదసన గంటి సాయిబాబు, శశికాంత్‌శర్మ ఆధ్వర్యం లో పెదసన గంటి ట్రస్ట్ ద్వారా మట్టివినాయక ప్రతిమలు గ్రామస్థు లకు ప్రతీఏటా అందజేస్తున్నారు. పరమేశ్వరబయోటెక్ ఎండీ ఆనంద్ స్వరూప్ ప్రతిమలు అందజేశారు. ఛైర్మన్ తేతలి ఉపేంద్రారెడ్డి, ఆర్య వైశ్య ప్రముఖులు తీగల బలరామయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెరవలి (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి జరుపుకునే ప్రతీఒక్కరూ మట్టి విగ్రహాలు ఉపయోగించాలని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పెరవలి అభయాంజనేయస్వామి సెంటర్‌లో మంగళవారం పెరవలి మండలం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎస్ఐ పాల్గొన్నారు. మరొక ముఖ్యఅతిథి డిప్యూటీ తహసీల్దార్ సన్నిబాబుమాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నీరు, గాలి ప్రకృతి సమతుల్యత అందించాలంటే ప్రజలు పర్యావరణ హితంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పావని, లయన్స్‌క్లబ్ సెక్రటరీ సలాది ఉదయ బాస్కరరావు, వీధి సత్యనారాయణ౦ పొపుప్ప హరేరామ్ ప్రసాద్, యాతం రామకృష్ణ పాల్గొన్నారు. అన్నవరప్పాడులో కూడా ఇంటింటికీ మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. జనసేన గ్రామ అధ్యక్షుడు పొప్పుప్ప సూర్యనాగేశ్వరరావు ఆధ్వర్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

చాగల్లు,(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోసం ప్రతివారు మట్టితో చేసిన వినాయక ప్రతిమలనే పూజలో వినియోగించాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వల్లిపల్లి వెంకట రామారావు అన్నారు. మంగళవారం వర్తక సంఘం సంపత్‌వర సిద్ధివినాయక ఆలయం వద్ద లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు పంపిణీ చేశారు. లయన్స్ ప్రముఖులు పిచ్చికల వెంకట సత్యనారాయణ, కోడి శ్రీనివాసరావు, ఆళ్ళ వెంకట సత్యన్నారాయణ, కోడూరి ప్రసాద్, సిహెచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.



నిడదవోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

● ఎమ్మెల్సీ సోము వీర్రాజు

కొవ్వూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ చేపట్టిన సారథ్యం కార్యక్రమం విజయవంతం చేయడంపై అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం మంగళవారం బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ నివాసంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. సుమారు 5వేల మందితో ఊరేగింపు ఏర్పాటుచేసి, బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 1వ తేదీన జిల్లా కేంద్రం రాజమహేంద్రవరానికి విచ్చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు ఘనస్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, డేగల సునీత, ఇందుగుల రామకృష్ణ, తాడిమళ్ల విజయవాణి, తురగా విజయభాస్కర్ పాల్గొన్నారు.

బీజేపీ సమావేశాన్ని జయప్రదం చేయండి

నిడదవోలు(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సెప్టెంబరు 1వ తేదీన జరిగే భారతీయ జనతా పార్టీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని ఆనంద్ ఫంక్షన్‌హాలులో స్థానిక బీజేపీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ సెప్టెంబరు 1వ తేదీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ వర్మ వస్తున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర అధ్యక్షుడికి ఘనంగా స్వాగతం పలకాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పిల్లలమర్రి మురళీకృష్ణ, మోర్త ప్రమోద్‌కుమార్, బాలాజీ, పాపారావు, రామారావు పాల్గొన్నారు.

వినాయకుడి ఆకృతితో ఆకట్టుకున్న విద్యార్థులు



వినాయకుడి ఆకృతిలో ఉన్న పాఠశాల విద్యార్థులు

తాళ్లపూడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా తాళ్లపూడి మాంటిస్సోరీ పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులతో వినాయకుడి ఆకృతి చిత్రీకరించారు. వినాయక చవితి సందర్భంగా విద్యార్థులతో వినాయకుడి ఆకృతిని ఏర్పాటు చేశామని పాఠశాల ప్రిన్స్‌పాల్ వీవీ అనీష్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



తాడిపర్రులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కరుటూరి నరేంద్ర

నల్లజర్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులు తీసుకోవడం సులభతరమని కూటమి నాయకులు కూసంపూడి వెంకటేశ్వరరావు, గుండాబత్తుల వరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం చీపురుగూడెం రేషన్ డిపోలో వీఆర్వో సునీత ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అదే విధంగా ఆవపాడులో సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమాల్లో చెల్లు రంగరావు, తలంశెట్టి శివ ప్రసాద్, కొత్తపల్లి హరిబాబు, చెల్లు నాయుడు, జవ్వాది పల్లాపరాజు, తలంశెట్టి నాగప్రసాద్, ప్రతిపాటి రాంబాబు, గుళ్ళపూడి వెంకటరత్నం, చెల్లు మోజేష్,అచ్యుత బాస్కరరావు పాల్గొన్నారు

పెరవలి(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రేషన్ కార్డులు పంపిణీ చేశారు. తీపర్రు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలోకూటమి నాయకులు పత్తిపాటి ప్రసాద్ కుమార్, నందమూరి నారాయణరావు, మొగళ్ళపు సీతారామ్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం(ఆంధ్రజ్యోతి): పాత రేషన్‌కార్డులు స్థానంలో కొత్త స్మార్ట్‌రేషన్ కార్డులను లబ్ధిదారుల ఇళ్ల వద్ద అందజేస్తున్నట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. మండలానికి సంబంధించి 23వేల 872స్మార్ట్ రైస్‌కార్డులు సిద్ధం అయ్యాయని మంగళవారం నుంచి మండలవ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో సచివాలయ సిబ్బంది కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉండ్రాజవరంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వీరమల్లు బాలాజీ, తాడిపర్రులో సర్పంచ్ కరుటూరి నరేంద్ర కార్డులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో స్థానిక వీఆర్‌వోలు లబ్దిదారులకు రేషన్ కార్డులు అందజేశారు.

వరి పంటపై కలుపుమందు పిచికారీ చేసిన దుండగులు

● రెండు ఎకరాల పంట ఎండిపోయిన వైనం

● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



గడ్డిమందు కొట్టడంతో ఎండిపోయిన వరి పంట

నల్లజర్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) ఎంతో కష్టపడి దుక్కు దున్ని నారువేసి నీళ్లు పెట్టి పంట పండిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు రాత్రికి రాత్రే పంటపై కలుపు మందు పిచికారీచేసి సర్వనాశనం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పోతవరం గ్రామానికి చెందిన రైతు రాగోలు ఏడుకొండలుకు పోతినీడు పాలెం రోడ్డు పొలిమేర పుంతవద్ద రెండు ఎకరాల వరి పంట వేశాడు. తనపై ఉన్న కక్షతో దుర్మార్గులు తమ ప్రతాపాన్ని పచ్చని పంటపై చూపించారు. రాత్రికి రాత్రే పంటపొలంపై కలుపు మంది పిచికారీ చేసి రెండు ఎకరాల పంటను నాశనం చేశారు. దీనిపై రైతు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నాయని, అనుమానితుల జాడ చెప్పిన వారిపై చర్యలు తీసుకోవడం లేదని తమకు కలిగిన నష్టం ఎవరు భరిస్తారని రైతు ప్రశ్నిస్తున్నాడు. వ్యక్తిగత కక్షలు ఉంటే మనుషులపై చూపించాలి తప్ప పంటలపై చూపించి ఆర్థికంగా దెబ్బ తీయడం సమంజసంకాదని టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

గోపాలపురం, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): బాలికను పెళ్లి చేసు కుం టానని నమ్మించి మోసం చేసిన బాలుడిపై పోక్సో కేసు నమోదైనట్లు ఎస్ఐ కే.మనోహర్ తెలిపారు. కొయ్యలగూడెం మండలంలో అమ్మమ్మ ఊరిలో విద్యాభ్యాసం చేస్తు న్నట్లు తెలిపారు. అదే సమయంలో బాలుడికి మధ్య పరిచయం ఏర్పడటంతో పెళ్లి చేసుకుంటానని వెంటపడుతూ వేధిస్తున్నాడని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మనోహర్ తెలిపారు.

దారికాచి గాయపర్చినవారిపై కేసు నమోదు

కొవ్వూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పాత గొడవలను పురస్కరించుకుని దారికాచి అడ్డగించి, దుర్భాషలాడి, కొట్టి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. కొవ్వూరు పట్టణానికి చెందిన కొడమంచిలి విజయ్‌కుమార్‌కు, తన భార్యకు గత కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. మంగళశారం విజయ్‌కుమార్ భాష్యం స్కూల్ రోడ్‌లో వెళ్తుండగా బావమరిది దొండపాటి సురేష్ అడ్డగించి, దుర్భాషలాడి కొట్టి గాయపర్చాడు. చికిత్స నిమిత్తం కొవ్వూరు ఆసుపత్రిలో చేరాడు. ఆసుపత్రి సమాచారం మేరకు విజయ్‌కుమార్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

గోపాలపురం, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ యండవల్లి శేఖర్ కవిత దంపతులు అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎముకలు, గుండె, నరాలు, జనరల్ వైద్యనిపుణులు పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ దంపతులకు జ్ఞాపికలు అందజేశారు.

రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



యర్నగూడెంలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖాధికారులు, రైతులు

దేవరపల్లి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): రైతులు సార్వా పంటలో ఎరువులు యాజమాన్య పద్ధతుల మేరకే సరైన మోతాదులో వేయాలని వ్యవసాయ శాఖాధికారి కె.కమలరాజు పేర్కొన్నారు. మండలంలోని యర్నగూడెం, ధూమంతనగూడెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కమలరాజు మాట్లాడుతూ సరైన పంట దశలోనే ఎరువులు వాడాలని పంటకు మోతాదుకు మించి ఎరువులు వేయరాదని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు బొల్లిన విజయభాస్కర్, గద్దే శ్రీనివాస్, మండా సుబ్బారావు, బిక్కిన ఏడుకొండలు, బిక్కిన నాగరాజు, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.